వార్తా పత్రికలు,
అధిక సంఖ్యలో పుస్తకముల ముద్రణ కోసం సంప్రదించండి.
9393949345.
విశాఖ సమాచారమ్ ప్రెస్
మల్టీకలర్ వెబ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

విలేకరులు కావలెను
విశాఖ సమాచారమ్
తెలుగు దినపత్రికకు దిగువ తెలిపిన ప్రాంతములలో విలేకరులు కావలెను.
గాజువాక, పాయకరావుపేట, కోటవురట్ల, నర్సీపట్నం, అడ్డురోడ్డు, తాళ్లపాలెం, పాడేరు, ఎస్.కోట, కొత్తవలస, పెందుర్తి, ఆనందపురం, తగరపువలస, విజయనగరం, శ్రీకాకుళం రూరల్.
సంప్రదించండి : 9393949345, 7013785256

RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 144 విశాఖపట్నం, 17 మార్చి 2023 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## రూ.2.79 లక్షల కోట్లతో ఏపీ బడ్జెట్

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రూ.2.79 లక్షల కోట్ల అంచనాలతో బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. పోతన పద్యంతో, రవీంద్రనాథ్ ఠాగూర్ వ్యాఖ్యలతో తన బడ్జెట్ ప్రసంగాన్ని మొదలుపెట్టారు. ఈ సందర్భంగా బడ్జెట్ రూపకల్పనలో భాగస్వాములైన వారికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కరోనా సంక్షోభ సమయంలో ఆటుపోట్లను అధిగమించామని మంత్రి బుగ్గన అన్నారు. ఈ బడ్జెట్ సుస్థిర అభివృద్ధి, సుపరిపాలనపై దృష్టి సారించామన్నారు.

రాష్ట్రంలో 62శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నట్టు మంత్రి బుగ్గన తెలిపారు. రైతుల ఆదాయం పెంచడంపైనే ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదని విశ్వసించే ప్రభుత్వం తమదని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని రైతు భరోసా కేంద్రాల పనితీరును ప్రపంచం మెచ్చుకుందని తెలిపారు. మిగిలిన 7,853 రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రాభివృద్ధిలో పాడిరంగం కీలక పాత్రం పోషిస్తుందని మంత్రి బుగ్గన తెలిపారు. గుడ్ల ఉత్పత్తిలో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉందన్నారు. మాంసం ఉత్పత్తిలో రెండో



స్థానం, పాల ఉత్పత్తిలో 5వ స్థానంలో ఉందని వెల్లడించారు. పశువుల బీమా కోసం వైఎస్ఆర్ పశు బీమా పథకం తీసుకొచ్చినట్లు మంత్రి బుగ్గన వెల్లడించారు. రాష్ట్రంలో 340 సంచార పశు వైద్యశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 154 నియోజవర్గాల్లో జంతు వ్యాధుల నిర్ధారణ కేంద్రాలు మంజూరు చేశామన్నారు.

వైఎస్ఆర్ పెన్షన్ కానుక రూ. 21,434.72 కోట్లు, వైఎస్ఆర్ రైతు భరోసా రూ.4,020 కోట్లు, జగనన్న విద్యా దీవెన రూ.2,841.64 కోట్లు, జగనన్న వసతి దీవెన రూ.2,200 కోట్లు, వైఎస్ఆర్-పీఎం బీమా యోజన రూ.1600 కోట్లు, డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాల కోసం రూ.1,000 కోట్లు, రైతులకు వడ్డీలేని రుణాలు రూ.500 కోట్లు, వైఎస్ఆర్ కాపు నేస్తం రూ.550 కోట్లు, జగనన్న చేదోడు రూ.350 కోట్లు, వైఎస్ఆర్ వాహనమిత్ర రూ.275 కోట్లు, వైఎస్ఆర్ నేతన్న నేస్తం రూ.200 కోట్లు, వైఎస్ఆర్ మత్స్యకార భరోసా రూ.125 కోట్లు, మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ రూ.50 కోట్లు, రైతు కుటుంబాల పరిహారం కోసం రూ.20 కోట్లు, లా నేస్తం రూ.17 కోట్లు, జగనన్న తోడు రూ.35 కోట్లు, ఈబీసీ నేస్తం రూ.610 కోట్లు, వైఎస్ఆర్ కల్యాణమస్తు రూ.200 కోట్లు, వైఎస్ఆర్ ఆసరా రూ.6700 కోట్లు, వైఎస్ఆర్ చేయూత రూ.5000 కోట్లు, అమ్మఒడి రూ.6500 కోట్లు, మొత్తంగా డీబీటీ స్కీంలకు రూ.54,228.36 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.3,000 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణ రూ.1,212 కోట్లు, వైద్యం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం రూ.15,882 కోట్లు, మన బడి నాడు-నేడు రూ.3,500 కోట్లు, జగనన్న విద్యా కానుక రూ.560 కోట్లు, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధికి రూ.15,873 కోట్లు, పురపాలక, పట్టణాభివృద్ధి రూ.9,381 కోట్లు, స్కిల్ డెవలప్‌మెంట్ రూ.1,166 కోట్లు, యువజన అభివృద్ధి, పర్యాటకం, సాంస్కృతిక శాఖ రూ.1,291 కోట్లు, షెడ్యూల్ కులాల కాంపొనెంట్ కోసం రూ.20,005 కోట్లు, షెడ్యూల్ తెగల కాంపొనెంట్ కోసం రూ.6,929 కోట్లు, వెనుకబడిన తరగతుల కాంపొనెంట్ కోసం రూ.38,605 కోట్లు, కాపు సంక్షేమం రూ.4,887 కోట్లు, మైనార్టీల సంక్షేమం రూ.4,203 కోట్లు, పేదలు అందరికీ ఇళ్లు రూ.5,600 కోట్లు, పరిశ్రమలు, వాణిజ్యం రూ.2,602 కోట్లు, రోడ్లు, భవనాల శాఖకు రూ. 9,118 కోట్లు, నీటి వనరుల అభివృద్ధికి (ఇరిగేషన్) రూ.11,908 కోట్లు, పర్యావరణం, అటవీ,

(మిగతా 2లో)

## గెలుపు దిశగా వైకాపా పరుగు: కొనసాగుతోన్న కౌంటింగ్



**అమరావతి/హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. గురువారం ఉదయం 8గంటల నుంచి అధికారులు ఓట్ల లెక్కింపు ప్రక్రియను మొదలు పెట్టారు. ఆయా లెక్కింపు కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ నెల 13న ఏపీలోని 3 గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలతో పాటు, రెండు ఉపాధ్యాయ, నాలుగు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలతో పాటు తెలంగాణలోని ఒక ఉపాధ్యాయ స్థానంలో ఎన్నికల పోలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. కౌంటింగ్ మొదలైన రెండు గంటల్లోనే స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. ఏపీలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులు విజయం సాధించారు. పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య భారీ సంఖ్యలో ఉండటంతో తుది ఫలితాలు వెల్లడయ్యే సరికి ఇంకా చాలా సమయం పట్టనుంది.

**శ్రీకాకుళంలో నర్తు రామారావు విజయం**

శ్రీకాకుళం జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితం వెలువడింది. వైకాపా అభ్యర్థి నర్తు రామారావు విజయం సాధించారు. ఈ ఎన్నికలో మొత్తం 752మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఓటు వేయగా.. 12ఓట్లు చెల్లలేదు. వైకాపా నేత రామారావుకు 632 ఓట్లు రాగా.. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆనేపు రామకృష్ణకు 108 ఓట్లు పోల్ అయ్యాయి.

**పశ్చిమ గోదావరి, కర్నూలులో వైకాపాదే గెలుపు..**

పశ్చిమగోదావరి జిల్లాలో స్థానిక రెండు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఈ రెండు స్థానాల్లోనూ వైకాపా అభ్యర్థులే గెలుపొందారు. వైకాపా అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ విజయం సాధించారు. మొత్తం 1105 ఓట్లు ఉండగా.. 1088 మంది స్థానిక ప్రజాప్రతినిధులు ఓటు వేశారు. వైకాపాకు చెందిన కవురు శ్రీనివాస్‌కు 481 మొదటిప్రాధాన్యతా ఓట్లు వచ్చాయి. వంకా రవీంద్రనరాథ్‌కు 460 ఓట్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్‌కు 120 ఓట్లు వచ్చాయి. మరోవైపు, కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ విజయం సాధించారు. మొత్తం ఓట్లు 1136 కాగా.. వీటిలో 53ఓట్లు చెల్లలేవు. వైకాపా అభ్యర్థికి 988 ఓట్లు రాగా.. స్వతంత్ర అభ్యర్థి మోహన్ రెడ్డికి 85 ఓట్లు వచ్చాయి. మరో స్వతంత్ర అభ్యర్థి వెంకట వేణుగోపాల్ రెడ్డికి 10 ఓట్లు వచ్చాయి. ఇదిలా ఉండగా, పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు అనంతపురం జేఎన్టీయూలో కొనసాగుతోంది.

**ఉత్తరాంధ్రలో ఫలితానికి 48గంటలు!**

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు 48 గంటలు పడుతుందని అంచనా. ఆరు

(మిగతా 2లో)

## ఐఏఎస్ఈ కి ఉన్నత్ భారత్ అభయాన్ నిధులు మంజూరు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్(ఐఏఎస్ఈ)కి ఉన్నత్ భారత్ అభయాన్‌లో భాగంగా కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ రూ 50 వేలు సీడ్ ఫండ్‌ని అందించింది. దీనిని గురువారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ అందుకున్నారు. ఈ నిధులను ఐఏఎస్ఈ దత్తత తీసుకున్న గ్రామాలను అభివృద్ధి చేయడానికి, మౌళిక వసతుల అభివృద్ధి చేయడానికి వినియోగిస్తారు. కార్యక్రమంలో యుబిఏ సమన్వయకర్త పావని, ఐఏఎస్ఈ సమన్వయకర్త డాక్టర్ సోనీ హవీలా తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజులపాటు వర్షాలు, ఈదురుగాలులు



**అమరావతి:** ఇప్పటికే హైదరాబాద్ తోపాటు తెలంగాణ జిల్లాల్లో వర్షాలు కురుస్తుండగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ వాతావరణం చల్లబడుతోంది. కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనం బంగ్లాదేశ్, పొరుగు ప్రాంతాల నుంచి ఉత్తర కోస్తాంధ్ర వరకు పశ్చిమబెంగాల్, ఒడిశా మీద సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉంది.

ఏపీలో మూడ్రోజులపాటు వర్షాలు ఉత్తర అంతర్గత తమిళనాడు నుంచి కొంకణ్ వరకు ఉన్న ద్రోణి ఇప్పుడు దక్షిణ తమిళనాడు నుంచి ఉత్తర కొంకణ్ వరకు తీర ప్రాంతం.. అంతర్గత కర్ణాటక, గోవా మీదుగా సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్లు ఎత్తు వరకు విస్తరించి ఉంది. ఈ క్రమంలోనే ఏపీలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు మెరుపులతో కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కూడా వేగంగా వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఉత్తర కోస్తాంధ్ర, యానాంలలో ఈదురుగాలులతో వర్షాలు ఉత్తర కోస్తాంధ్ర, యానాంలలో గురు, శుక్రవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన వర్షాలు అనేక చోట్ల కురిసే అవకాశం ఉంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశం ఉంది. ఈదురుగాలులు 40-50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒకటిరెండు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈదురుగాలులు కూడా వీస్తాయని తెలిపింది.

కోస్తాంధ్ర, రాయలసీమలోనూ ఉరుములుమెరుపులతో వర్షాలు దక్షిణ కోస్తాంధ్రలో గురువారం నుంచి మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరికొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈదురుగాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని

(మిగతా 2లో)

## 'పరిశ్రమ' హోదాతోనే పర్యాటక వికాసం

**న్యూఢిల్లీ:** పర్యాటక రంగానికి రాష్ట్రాలు పరిశ్రమ హోదా కల్పిస్తే అది మరింతగా రాణిస్తుందని పర్యాటక శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రాజ్యసభలో గురువారం వైఎస్సార్సీపీ సభ్యులు శ్రీ వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలదే. పరిశ్రమ హోదా పొందడం ద్వారా పర్యాటక రంగం దాని అనుబంధ రంగాలు ఇతర పరిశ్రమలతో సమానంగా విద్యుత్ చార్జీలు, ఇతర పన్నుల వంటి ద్వారా లబ్ధి పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతానికి పర్యాటక రంగం వాణిజ్యం కేటగిరిలో ఉన్నందున అధిక రేట్లను చెల్లించాల్సి వస్తోందని మంత్రి తెలిపారు. పర్యాటకానికి పరిశ్రమ హోదా కల్పిస్తే భారీ పెట్టుబడులు అవసరమయ్యే ఆతిథ్య రంగంలో పెట్టుబడి ఖర్చు గణనీయంగా తగ్గి ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులకు ప్రోత్సాహకారిగా మారుతుందని అన్నారు.

దేశంలో ఇప్పటికే గుజరాత్, కేరళ, రాజస్థాన్, పంజాబ్, గోవా, కర్నాటక, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, జమ్మూ,కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, త్రిపుర వంటి పదకొండు రాష్ట్రాలు పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించినట్లు మంత్రి తెలిపారు. మిగిలిన ఇతర రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలు కూడా పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించాల్సిందిగా తమ మంత్రిత్వ

(మిగతా 2లో)

### శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో

## ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు




గ్లకోమా ర్యాలీని ప్రారంభిస్తున్న డా. రవీంద్ర

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర జిల్లాలో నాణ్యమైన కంటి వైద్యం అందించడంలో ఎంతో పేరుగాంచిన వేపగుంటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి "ప్రపంచ గ్లకోమా వారోత్సవాలను" మార్చి 12 నుండి 18 వరకు జరుపుకొంటుంది. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం హాస్పిటల్ నుండి వేపగుంట వరకు గ్లకోమా వ్యాధి అవగాహనపై ఒక ర్యాలీని నిర్వహించారు. డాక్టర్ టి.రవీంద్ర సీనియర్ గ్లకోమా స్పెషలిస్ట్ శంకర్ ఫౌండేషన్ ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో డా. మంజువల్లి, గ్లకోమా కన్సల్టెంట్ ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. డా. రవీంద్ర మాట్లాడుతూ గ్లకోమా అనేది నిశ్శబ్ధంగా కంటి చూపును అపహరించే వ్యాధి అని ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకొని, తగిన సమయంలో కంటి చికిత్సలు చేయించుకొని వ్యాధి నిరోధానికి ప్రజలు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. శంకర్ ఫౌండేషన్‌లో అన్ని రకాల కంటి శస్త్ర చికిత్సలకు మెరుగైన వైద్యం అందించడంలో డాక్టర్లు ఎంతో కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

ఈ వారోత్సవాల్లో భాగంగా ఆసుపత్రిలో రోగులకు గ్లకోమాపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. డా.మంజువల్లి గ్లకోమాపై ఒక అవగాహన కార్యక్రమాన్ని రోగులకు నిర్వహించారు. గ్లకోమా వ్యాధిపై డ్రాయింగ్, పెయింటింగ్‌పై ఉద్యోగుల్లో పోటీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను ఆఖరి రోజున ప్రధానం చేస్తారు.

## ఫుట్ పాత్ లపై ఉన్న ఆక్రమణలు తొలగించండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగరంలో ఫుట్ పాత్ లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని జివిఎంసి కమిషనర్ పి రాజాబాబు పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు. గురువారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా చిన్నవాల్తేరు నుండి అప్పుఘర్ వరకు నడక మార్గాన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫుట్ పాత్‌లపై చాల వరకు ఆక్రమణలు ఉన్నాయని, కార్ల సర్వీసింగ్ సెంటర్ వద్ద చాలా వరకు ఫుట్ పాత్ ను ఆక్రమించి కార్లు పెడుతున్నారని వాటిని వెంటనే తొలగించాలని, ఇకపై శాశ్వతంగా ఫుట్ పాత్ లపై దుకాణాలు లాంటివి పెట్టకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. ఎలక్ట్రికల్ పోల్సుకు కేబుల్ వైర్లు వేలాడుతున్నాయని, వాటిని క్రమబద్ధీకరించి కట్టాలని, అనవసర కేబుల్ వైర్లు వేలాడుతున్నాయని, వాటిని తొలగించాలని ఆదేశించారు. పలు చోట్ల మొక్కలకు ట్రిమ్మింగ్ చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు తొలగించేలా ఆ స్థల యజమానులకు తెలిపి వారిచే శుభ్రం చేయించాలన్నారు. ప్రధాన రోడ్లకు కనక్టు అవుతున్న అప్రోచ్ రోడ్ల మరమ్మత్తులను చేపట్టి ఆకర్షణీయంగా కనిపించేలా చూడాలన్నారు. రేసవానిపాలెం గణేష్ నగర్ వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని ఆ స్థల యజమానులచే శుభ్రం చేయించాలని ఆదేశించారు. పారిశుధ్యం సంతృప్తికరంగా ఉన్నప్పటికీ ఇంకా మెరుగుగా వుండే విధంగా చూడాలని, సెంట్రల్ మీడియంలో ఆకర్షణీయంగా ప్లాంటేషన్ పచ్చగా కనిపించే విధంగా చర్యలు చేపట్టాలని, రాత్రి పూట పశువుల సంచారం లేకుండా చూడాలని ఆదేశించారు. సైడ్ మీడియన్లలా భవన నిర్మాణ వ్యర్థాలు కనిపిస్తున్నాయని, వాటిని వెంటనే

(మిగతా 2లో)

## (మొదటి పేజీ తరువాయిలు)

### రూ.2.79 లక్షల కోట్లతో ఏపీ బడ్జెట్

శాస్త్ర సాంకేతిక శాఖ రూ.685 కోట్లు, ఎనర్జీ రూ.6,456 కోట్లు, గ్రామ, వార్డు సచివాలయ శాఖ రూ.3,858 కోట్లు, గడప గడపకు మన ప్రభుత్వం రూ.532 కోట్లు.

### గెలుపు దిశగా వైకాపా పరుగు: కొనసాగుతోన్న కౌంటింగ్

జిల్లాల్లో కలిపి 2లక్షలకు పైగా ఓట్లు పోలయ్యాయి. 2007, 2011, 2017లలో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ రెండో ప్రాధాన్య ఓటుతోనే అభ్యర్థులు విజయం సాధించారు. ఈసారి కూడా ఆ ఓటే కీలకం కానుందని సమాచారం. విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో 500మంది సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి.. విడతల వారీగా ఓట్ల లెక్కింపులో పాల్గొననున్నారు. ఏడు రౌండ్లలో 2,00,926 ఓట్లు లెక్కింపునకు కనీసం 10 నుంచి 12గంటలు పడుతుంది.

రంగారెడ్డి-మహబూబ్‌నగర్-హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. ఈ లెక్కింపు కోసం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో 28 టేబుళ్లు ఏర్పాటు చేశారు. మూడు షిఫ్ట్‌ల్లో లెక్కింపు జరగనుంది. ప్రతి టేబుల్‌కు సూపర్‌వైజర్, ఇద్దరు సిబ్బంది, అబ్జర్వర్‌ను నియమించారు. ఒక్కో రూమ్‌కు ముగ్గురు ఏఆర్వోలు, ముగ్గురు అడిషనల్ కలెక్టర్లు పర్యవేక్షించనున్నారు. మరోవైపు, శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నంబీ ప్రకాశం-నెల్లూరు-చిత్తూరుబీ కడప-అనంతపురం-కర్నూలు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలు, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు, కడప-అనంతపురం-కర్నూలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలు, పశ్చిమగోదావరిలో 2, శ్రీకాకుళం, కర్నూలులో ఒక్కొక్కటి చొప్పున స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గాలతో పాటు తెలంగాణలో హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో పోలింగ్ నిర్వహించారు. స్థానిక సంస్థల నియోజకవర్గాలకు సంబంధించి అనంతపురం, కడప, నెల్లూరు, తూర్పుగోదావరి, చిత్తూరు జిల్లాలకు చెందిన 5 స్థానాలు ఇప్పటికే ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

### మూడు రోజులపాటు వర్షాలు, ఈదురుగాలులు

వాతావరణ శాఖ వెల్లడించింది. మరోవైపు, రాయలసీమలోనూ గురు, శుక్ర, శనివారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. పలుచోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వానలు పడతాయని పేర్కొంది. ఈదురుగాలులతో కూడిన వర్షాలు మరికొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది.

### 'పరిశ్రమ' హోదాతోనే పర్యాటక వికాసం

శాఖ పదేపదే సలహా ఇస్తోంది. ఆయా రాష్ట్రాల అధికారులతో ఉన్నత స్థాయిలో జరిగే ఇంటరాక్టివ్ సెషన్స్‌లోను, సమావేశాలలోను, కరస్పాండెన్స్ ద్వారా వాటిని ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.

### ఫుట్ పాత్ లపై ఉన్న ఆక్రమణలు తొలగించండి

తొలగించాలని పట్టణ ప్రణాళికాధికారులకు ఆదేశించారు.

ఈ పర్యటనలో డిడి(హార్టికల్చర్) ఎం దామోదర రావు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, డిసిపి సంజయ్ రత్నకుమార్, ఎసిపి వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్, డిప్యూటీ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) లక్కోజి, ప్రజారోగ్యపు అధికారులు, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## అరకులో భారీ వర్షం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో భారీ వర్షం.గంటకు పైగా అరకులోయ ను ముంచెత్తుతున్న వాన. ఉరుములతో కురుస్తున్న భారీ వర్షం. వర్షానికి సేద తీరుతున్న స్థానికులు, పర్యాటకులు.

## స్వరూపానందేంద్రను కలిసిన క్రికెటర్ భరత్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):**భారత క్రికెట్ జట్టు ఆటగాడు, వికెట్ కీపర్ కేఎస్ భరత్ గురువారం విశాఖ శ్రీ శారదాపీఠాన్ని సందర్శించాడు. భార్య అంజలితో కలిసి రాజశ్యామల అమ్మవారి దర్శించుకున్నాడు. అనంతరం పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామిని కలిసి ఆశీస్సులు అందుకున్నాడు. గుజరాత్ టైటాన్ తరపున ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడేందుకు అహ్మదాబాద్ క్యాంప్ కు వెళుతున్నట్లు తెలిపాడు. అమ్మవారి అనుగ్రహం, పీఠాధిపతుల ఆశీస్సుల కోసం విశాఖ శ్రీ శారదాపీఠాన్ని సందర్శించానని అన్నాడు

## జియోమార్ట్ 'క్రాఫ్ట్ మేళా' ప్రారంభం

### నేటి నుంచి 19వ తేదీ వరకు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భారతదేశంలోని ప్రముఖ స్వదేశీ ఈ-మార్కెట్ ప్లేస్‌లలో ఒకటైన రిలయన్స్ రిటైల్ జియోమార్ట్ అతిపెద్ద హ్యాండ్లూమ్, హస్తకళల 'క్రాఫ్ట్ మేళా'ను ప్రారంభించింది. 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను ప్రదర్శించడానికి స్థానిక చేనేత కార్మికులను శక్తివంతం చేయాలనే దృష్టితో దీనికి ప్రాధాన్యతనిస్తుంది. కస్టమర్‌లు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ వెర్షన్‌ను సందర్శించడానికి అవకాశం ఉంటుంది. మార్చి 17వ తేదీ నుంచి 19 వరకు ప్రత్యేకమైన ఉత్పత్తుల ప్రదర్శన ఉండనుంది. క్రాఫ్ట్ మేళా ద్వారా జియోమార్ట్ భారతదేశంలోని 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 10 వేల కళాకారులు, నేత కార్మికుల జీవితాలపై ప్రభావం చూపుతుంది. జియో మార్ట్ ఇప్పటికే 600పైగా విక్రేతలు, మాస్టర్ ఆర్టిజన్‌లను ఆన్‌బోర్డ్ చేసింది. వినియోగదారులు 85 వేల ఉత్పత్తుల నుంచి ఎంచుకోవచ్చు.

ఈ సందర్భంగా జియోమార్ట్ సీఈవో సందీప్ వరగంటి మాట్లాడుతూ ఈ-కామర్స్ ద్వారా భారతదేశంలోని స్థానిక కళాకారులను, వీవర్ కమ్యూనిటీని బలోపేతం చేయడానికి జియోమార్ట్ కృత నిశ్చయంతో ఉందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విక్రేతలకు తమ వస్తువులను ఆన్‌లైన్‌లో విభిన్న కస్టమర్ బేస్‌కి అందుబాటులో ఉంటుందన్నారు. మా అమ్మకందారుల ఉత్పత్తి వర్గీకరణను విస్తృతం చేస్తున్నందున, కళాకారులు, కస్టమర్‌లు ఇద్దరికీ ప్రయోజనం చేకూర్చే స్థానిక కళారూపాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు.

మూడు రోజుల పాటు జరిగే ఉత్సవంలో జియో మార్ట్ అసమానమైన హస్తకళను అందించే భారతీయ చేనేత కార్మికులు, చేతివృత్తుల వారి నుంచి క్లిష్టమైన డిజైన్‌లతో విస్తృతమైన ప్రామాణికమైన వస్తువులను కలిగి ఉంటుందన్నారు. ఇందులో ఒడిశా నుంచి సంబల్‌పురి చీరలు, కేరళ నుంచి కసావు చీరలు, జైపూర్ నుంచి బ్లాక్ ప్రింటెడ్ బెడ్‌షీట్లు, మధుబని పెయింటింగ్‌లు, ధోక్రా ఆర్ట్‌వర్క్, జోధ్‌పూర్ నుండి చెక్క గృహాలంకరణ, లక్నో నుంచి అందమైన చికంకారి చేతితో పని చేసే బట్టలు, చన్నపట్నం చెక్క బొమ్మలు, పర్యావరణ అనుకూలమైన యోగా మ్యాట్‌లు ఇంకా ఎన్నో కలవని తెలిపారు.

## ప్రపంచంలోనే ది బెస్ట్ విమానాశ్రయం ఇదే..



ప్రపంచంలోనే అత్యుత్తమ విమానాశ్రయంగా సింగపూర్‌లోని 'ఛాంగి' విమానాశ్రయంలో నిలిచింది. రెండేళ్ల తర్వాత ఖతార్‌ను వెనక్కినెట్టి తన స్థానాన్ని పదిలం చేసుకుంది. సింగపూర్‌లోని 'ఛాంగి' అంతర్జాతీయ విమానాశ్రయం ప్రపంచంలోనే అత్యుత్తమ విమానాశ్రయంగా నిలిచింది. రెండేళ్ల తర్వాత ఖతార్‌ను వెనక్కి నెట్టి మళ్లీ తన స్థానాన్ని తిరిగి సాధించుకుంది. కొవిడ్ పరిస్థితుల నేపథ్యంలో సింగపూర్ విదేశీ విమానాల రాకపోకలపై తీవ్ర ఆంక్షలు విధించింది. దీంతో రెండేళ్ల క్రితం ఆ స్థానాన్ని ఖతార్ చేజిక్కించుకుంది. అయితే, పరిస్థితులు సాధారణ స్థితికి రావడంతో రాకపోకలపై సింగపూర్ ఆంక్షలు ఎత్తివేసింది. దీంతో మళ్లీ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఖతార్ రాజధాని దోహాలోని హమద్ అంతర్జాతీయ విమానాశ్రయం రెండో స్థానంలో నిలవగా.. టోక్యోలోని హనీదా విమానాశ్రయం మూడో స్థానంలో నిలిచింది. విమాన ప్రయాణం చేసిన తర్వాత ప్రయాణికులు ఇచ్చే ఫీడ్ బ్యాక్ ఆధారంగా స్కైట్రాక్స్ సంస్థ ప్రతి ఏటా సర్వే నిర్వహిస్తోంది. ప్రపంచంలోనే తొలి 20 ఉత్తమ విమానాశ్రయాలను ఎంపిక చేసి.. స్కైట్రాక్స్ వరల్డ్ ఎయిర్‌పోర్ట్ అవార్డ్స్ పేరిట సత్కరిస్తోంది. అయితే, ఉత్తమ ఎయిర్‌పోర్టులుగా నిలిచిన వాటిలో తొలి 10 స్థానాల్లో అమెరికాకు చెందిన ఒక్క విమానాశ్రయం కూడా లేకపోవడం గమనార్హం.

ప్రపంచంలో తొలి 20 అత్యుత్తమ విమానాశ్రయాలు ఇవే..

1.ఛాంగి (సింగపూర్) 2. హమద్ (దోహా) 3. హనీదా (టోక్యో) 4.ఇన్చెయాన్ (సియోల్) 5. చార్లెస్ డి గలే (పారిస్) 6. ఇస్తాంబుల్ (తుర్కియే) 7. మ్యూనిక్ (జర్మనీ) 8. జ్యూరిక్ (స్విట్జర్లాండ్) 9. నరీతా (టోక్యో), 10 బరాజస్ (మాడ్రిడ్) 11. వియన్నా (ఆస్ట్రియా) 12. వాంటా (ఫిన్లాండ్) 13. ఫ్యూమిసినో (రోమ్). 14. కోపెన్ హెగెన్ (డెన్మార్క్) 15.కాన్సాయ్ (జపాన్) 16. సెంట్రెన్ నయోగా (జపాన్) 17. దుబాయ్ 18. టకోమా (సియాటెల్), 19. మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా) 20.వాంకోవర్ (కెనడా).

న్యూయార్క్‌లోని జేఎఫ్‌కే విమానాశ్రయం 85వ స్థానం నుంచి 88కి పడిపోయింది.

చైనాకు చెందిన షెంజెన్ 26 స్థానాలు ముందుకెళ్లి 31వ స్థానంలో నిలిచింది

గత ఏడాది 26 స్థానంలో ఉన్న ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ ఈసారి 19వ స్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియాలోని విమానాశ్రయాల్లో ఇదే అత్యుతమైనదిగా నిలిచింది.

లండన్‌లోని హీత్రో విమానాశ్రయంలో 9 స్థానాలు పడిపోయి 22వ స్థానంలో నిలిచింది.

భారత్‌లోని ఏ విమానాశ్రయమూ తొలి 20 స్థానాల్లో నిలవక పోయినప్పటికీ దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం దక్షిణాసియాలో ఉత్తమ ఎయిర్‌పోర్టుగా నిలిచింది.

## నకిలీ ఆఫర్ లెటర్లతో భారతీయ విద్యార్థులు

దిల్లీ: ఉన్నత విద్యను అభ్యసించేందుకు భారత్ నుంచి విదేశాలకు వెళ్తోన్న వారి సంఖ్య ప్రతిఏటా పెరుగుతోన్న విషయం తెలిసిందే. ముఖ్యంగా అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాతో పాటు యూరప్ దేశాలకూ భారతీయ విద్యార్థులు క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో కెనడా విద్యా సంస్థల్లో అడ్మిషన్ కోసం ఇచ్చిన ఆఫర్ లెటర్లలో కొన్ని తప్పుడువి ఉన్నట్లు అక్కడి అధికారులు గుర్తించారు. దీంతో సదరు విద్యార్థులకు కెనడియన్ బార్డర్ సెక్యూరిటీ ఏజెన్సీ డిపార్టేషన్ లెటర్లు కూడా అందించినట్లు సమాచారం. ఇలా సుమారు 700 మంది భారతీయ విద్యార్థులు కెనడా నుంచి బహిష్కరణ గండాన్ని ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది.

డిపార్టేషన్ లెటర్లు అందుకున్న కొందరు విద్యార్థులు చెబుతున్న వివరాల ప్రకారం, పంజాబ్ జలంధర్‌లో ఓ వ్యక్తి ఎడ్యుకేషన్ మైగ్రేషన్ సర్వీసెస్ నిర్వహిస్తున్నాడు. కెనడాలోని ప్రముఖ కాలేజీలో అడ్మిషన్ కోసం ఒక్కో విద్యార్థి వద్ద నుంచి రూ.16లక్షలు వసూలు చేశాడు. దీంతో వారంతా 2018-19లో అడ్మిషన్ పొంది చదువులు కూడా పూర్తిచేశారు. అంతేకాకుండా వారిలో కొందరు ఉద్యోగాలూ సంపాదించి అక్కడే నివసిస్తున్నారు. ఇంతవరకు బాగానే నడిచింది. కానీ ఇలా వెళ్లిన వారిలో కొందరు కెనడాలో పీఆర్ (శాశ్వత నివాసం) కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించిన సీబీఎస్‌ఏ.. వీసా కోసం కొందరు విద్యార్థులు సమర్పించిన దస్త్రాలు నకిలీవని గుర్తించారు. ఇవన్నీ జలంధర్ కేంద్రంగా ఉన్న ఆ కన్సల్టెన్సీవేనని.. 2018-2022 మధ్య కాలంలో అక్కడనుంచి సుమారు 700 మంది కెనడాలో చదువులకు ఆఫర్ లెటర్లు పొందినట్లు సమాచారం.ఈ తరహా భారీ మోసం వెలుగుచూడటం కెనడాలో ఇదే తొలిసారి అని తెలుస్తోంది. అయితే, బహిష్కరణను ఎదుర్కొంటున్న వారిలో పంజాబ్‌లోని జలంధర్ నుంచి వెళ్లిన వాళ్లే ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు కెనడాలో తప్పుడు దస్త్రాల అంశానికి సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని జలంధర్ పోలీసులు వెల్లడించారు.

## ఏపీఎస్‌ఆర్టీసీ నాన్ ఏసీ స్లీపర్ కోచ్-!



ప్రస్తుతం మంత్రాలయం-బెంగళూరు, కడప-విజయవాడ, కడప-హైదరాబాద్, ఒంగోలు-హైదరాబాద్, విజయవాడ-విశాఖపట్నం, నెల్లూరు-హైదరాబాద్, నెల్లూరు-బెంగళూరు మధ్య స్టార్ లైనర్ నాన్ ఏసీ స్లీపర్ బస్సులు రాకపోకలు సాగిస్తోన్నాయి. ఈ సమ్మర్ సీజన్ లో మరిన్ని నగరాలు, జిల్లా కేంద్రాల మధ్య ఈ సర్వీసులను ప్రవేశపెట్టడానికి అధికారులు చర్యలు తీసుకుంటోన్నారు. తాజాగా విజయవాడ- మియాపూర్ మధ్య కూడా ఈ బస్సు అందుబాటులోకి వచ్చింది.

**రైళ్లను తలదన్నేలా..**

నాన్ ఏసీ కావడం, రైలు స్లీపర్ కోచ్ లను తలదన్నేలా దీన్ని డిజైన్ చేయడం వల్ల ఈ సర్వీసులకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. నాన్ ఏసీ కావడం వల్ల ఛార్జీ కూడా అందుబాటులోనే ఉంటోంది. వేసవి సెలవుల్లో తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి వెళ్లే భక్తుల రద్దీకి అనుగుణంగా వివిధ జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాల నుంచి స్టార్ లైనర్ సర్వీసులను నడిపించనుంది ఏపీఎస్‌ఆర్టీసీ.

**తిరుపతికి ఏసీ బస్సులు..**

తిరుపతి నుంచి వివిధ జిల్లాల మధ్య ఈ ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను ప్రవేశపెట్టడానికి అన్ని చర్యలు తీసుకున్నారు. దీనికి అదనంగా నాన్ ఏసీ స్లీపర్ బస్సులు నడుస్తాయి. గ్రీన్ సప్తగిరి పేరుతో ఈ ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను నడిపించనున్నారు ఆర్టీసీ అధికారులు. మలి విడతలో తిరుపతి-కడప, తిరుపతి-నెల్లూరు, తిరుపతి-మదనపల్లి మధ్య వీటిని రోడ్డెక్కించడానికి సన్నాహాలు చేపట్టారు. త్వరలోనే అవి అందుబాటులోకి రానున్నాయి.

**వేసవి సెలవుల్లో..**

వేసవి సెలవుల నాటికల్లా ఆయా బస్సులను ప్రయాణికులకు తమ సేవలను అందించడానికి రెడీ కానున్నాయి. జీరో ఎమిషన్ బస్సులు అవి. డీజిల్ కు బదులుగా విద్యుత్ ఛార్జింగ్ ద్వారా నడుస్తాయి. దీనికోసం ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తోంది ఏపీఎస్ఆర్టీసీ. పర్యావరణ పరిరక్షణ, సప్తగిరులపై కాలుష్యాన్ని నివారించడంలో భాగంగా కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటోంది. ఏప్రిల్ నుంచి కొత్త బస్సులను ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

### పంచాంగం

శుక్రవారం 17-03-2023
శుభకృత్ నామ సంవత్సరము
ఉత్తరాయణం శిశిర రుతువు
ఫాల్గుణ మాసం

తిథి : బ. దశమి ఉ. 11.00
నక్షత్రం : ఉత్తరాషాఢ రా. 12.22
వర్జ్యం : ఉ. 09.26 ల 10.56



సమస్యలతో సతమతమవడం కంటే సాధకుల సహాయం కోరుట మేలు.

బ్రహ్మశ్రీ హనుమద్దాస్ స్వామీజీ గారు ప్రస్తుతం చెన్నైలో ఉన్నారు.

సెల్ : 9440537607

## పొట్టి శ్రీరాములు సేవలు, ప్రాణ త్యాగం మరువలేనివి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల, నివాళులు అర్పించిన పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్.ఆంధ్రప్రదేశ్ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుసేవలు మరువలేనివని అభిప్రాయపడ్డారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ శ్రీ వి. విద్యాసాగర్ నాయుడు, ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ డా. ఓ. దిలీప్ కిరణ్, పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో ఈరోజు పొట్టి శ్రీరాములు జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్ కు చేసిన సేవలు, ప్రాణత్యాగం గురించి కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా చేసుకొని విధుల్లోపునరంకితం అవుదామని అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలకొండ డీఎస్పీ జీ.వి . కృష్ణా రావు , జిల్లా ఆర్మడ్ అధికారులు , పోలీస్ సిబ్బంది, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బందిలి తదితరులు పాల్గొన్నారు.

## నోటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** నోటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.బగాది జగన్నాథ రావు అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని జిల్లా ఆసుపత్రి గురు వారం నిర్వహించింది. ఇందులో భాగంగా నోటి ఆరోగ్యంపై అవగాహన ర్యాలీని ఆర్. సి.ఎం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ నోటి ఆరోగ్యంపై అవగాహన అవసరం అన్నారు. చిన్నప్పటి నుండి నోటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆయన పేర్కొన్నారు. నోటిలో పళ్ళు ఎంతో పటుత్వమైనవని, అయితే తగిన పోషణ లేక అనారోగ్యంపాలు చేస్తున్నామని ఆయన చెప్పారు. ప్రతి రోజు ఉదయం, రాత్రి రెండు పూటల దంతాలను శుభ్రం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆరు నెలలకు ఒకసారి దంత వైద్యుని సంప్రదించడం అవసరం అన్నారు. సరైన శ్రద్ధ వహించకపోవడం, పొగ తాగడం వంటి కారణాల వలన నోటి కేన్సర్ తదితర రోగాలకు గురి అవుతున్నామని ఆయన పేర్కొన్నారు. బ్రష్ చేసే విధానంపైనా, వినియోగించే పేస్టు పైనా అవగాహన అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ మరియు డి.సి.హెచ్.ఎస్ డా.బి.వాగ్దేవి, వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాకినాడలో కారు బీభత్సం.. పలువురికి గాయాలు



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** కాకినాడలో ఓ కారు బీభత్సం సృష్టించింది. నగరంలోని గోల్డ్ మార్కెట్ సెంటర్ సమీపంలో ఓ కారు.. ద్విచక్రవాహనదారులు, సైకిళ్లపై దూసుకెళ్లి హల్‌చల్ చేసింది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. వీరందరినీ చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కారులోని డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న కాకినాడ మూడో పట్టణ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఈ ఘటనలో పలు బైక్‌లు, కార్లు ధ్వంసమైనట్టు సమాచారం. కారు నడిపిన వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు.

విశాఖ సమాచారమ్

శుక్రవారం 17-03-2023

# సృష్టి రహస్యం

యావత్తు సృష్టిని.. ఒక్క గంటలో తయారు చేయగల్గిన దేవుడు.. స్త్రీ మూర్తిని తయారు చేయడానికి మాత్రం వారం రోజులు కష్ట పడ్డడంట. ఎందుకో తెలుసుకోవాలంటే మనసు పెట్టి చదవాలి.

మగాడితో సహా సర్వ జీవులను పుట్టించేసిన దేవుడు చివరగా ఒక స్త్రీని సృష్టించడం మొదలుపెట్టాడు.

ఒక రోజా రెండు రోజులూ కాదు. ఏకంగా వారంరోజులు తీసుకున్నాడు..స్త్రీ సృష్టికోసం. మిగిలిన పనులన్నీ మానుకుని..తన నాథుడు స్త్రీ సృష్టికోసం ఇంతగా తలమునకలైపోవడం చూసిన దేవత అడిగింది... "స్త్రీని సృష్టించడానికి ఎందుకింత సమయం తీసుకున్నారని?".

అప్పుడు దేవుడు.. "ఏం చెయ్యను మరి...

ఈ స్త్రీ హృదయంలో ఎన్ని విషయాలు పొదగాల్సి వచ్చిందో తెలుసా... ఇష్టాయిష్టాలకతీతంగా ఉండాలీ..

సృష్టి. వివక్ష తగదు. మొండికేసే పిల్లాడిని క్షణాల్లో దారికి తెచ్చుకోవాలి.

చిన్న చిన్న గాయాలు మొదలుకుని ముక్కలయ్యే మనసులవరకూ ఎన్నెన్ని సంఘటనలను ఈ జీవి ఎదుర్కోవాలో తెలుసా... ఆమె ఎంతమందికి ఓ ఔషధంగా పని చేయాలో తెలుసా...ఆమెకు ఆరోగ్యం బాగులేకున్నా సరే తనకు తానే సర్దుకుపోవాలి.

అడిగేవారు ఉండరూ ఉండకపోవచ్చు...రోజుకు పద్దెనిమిది గంటలు పని చేయాలి. ఇన్ని రకాల పనులు చెయ్యాల్సి వచ్చినా ఆమెకు ఉన్నవి రెండు చేతులే...." అన్నాడు.

"ఏంటీ? ఇన్ని పనులు చేయడానికి ఆమెకు రెండు చేతులేనా?" అని ఆశ్చర్యపోతూ దేవత ఆమెను మెల్లగా తాకింది. "ఇదేంటీ ఇంత మృదువుగా ఉందే ఈమె దేహం" అని ప్రశ్నించింది.

అప్పుడు దేవుడు.."ఆమె శారీరకంగా మృదువుగా మెత్తగా నాజూకుగా ఉండొచ్చు.

కానీ మానసికంగా ఆమె ఎంతో బలవంతురాలు.

అందుకే ఆమె ఎన్నో సమస్యలను ఎదుర్కోగలదు. అంతేకాదు, ఆమె అన్ని భారాలనూ తట్టుకోగలదు.

ఇష్టం, కష్టం, ప్రేమ, కోపం, తాపం, అంటూ అన్ని భావోద్వేగాలనూ ఆమె చవిచూడాలి.

అవసరమైతే దిగమింగాలి. కోపమొస్తే నవ్వుతూ వెల్లడించే శక్తి ఆమెకుండాలి. తనకు న్యాయం అనిపించినప్పుడు అందుకోసం పట్టుపట్టడమూ తెలుసు.

ఇతరుల దగ్గర ఆశించేది ప్రేమానురాగాలను...." అన్నాడు.

"ఓహో. ఈమె ఆలోచించగలదా" అని దేవత అడిగింది. అప్పుడు దేవుడు.. "ఎందుకాలోచించదు?

అన్ని విషయాలూ ఆలోచించడమే కాకుండా సమస్యలు ఎదురైతే పరిష్కారాలు చెప్పగలదు..." అన్నాడు.

దేవత ఆమె చెక్కిళ్ళను తాకి "ఈ చెక్కిళ్ళు తడిగా ఉన్నాయేంటీ? కన్నీరు కారుస్తోందిగా....ఏంటిది? " అని అడిగింది.

అప్పుడు దేవుడు.. "అదా...కన్నీరది.

ఆ కన్నీటిలో ఆనందమూ ఆవేదనా దుఃఖమూ దిగులూ ఆశ్చర్యమూ భయమూ అంటూ అన్ని రకాల ఉద్వేగానుభూతులూ ఉంటాయి.

ఆ కన్నీటికున్న శక్తి అనంతం....

పైగా మరో జీవికి ప్రాణంపోసి పది నెలలూ పొట్టలో మోసే నేర్పు ఆమెకు ఉంది" చెప్పాడు.

దేవత ఆశ్చర్యపోతూ "మీ సృష్టిలో విశిష్టమైనది ఇదే. .." అని చెప్పింది.

అయితే దేవుడు.. "అంతా బాగానే ఉన్నా ఆమెకు తన విలువా శక్తీ తెలిసినా..వాటిని అవసరమైతే తప్ప ప్రయోగించదు. అప్పటివరకూ తెలియనట్టే ఉంటుంది..." అవసరమైనప్పుడు. ఆ శక్తి ముందు.. ఎవరూ నిలబడలేరు అని చెప్పి భూమ్మీదకు పంపాడు స్త్రీని.. ! ఇదంతా చదువుతుంటే.. మన జీవితంలో జరిగిన ఎన్నో ఘటనలు జ్ఞప్తికి వస్తున్నాయి కదా. అందుకనే ఏమో స్త్రీని పుడమి తల్లి తో పోల్చారు.

# నేడు అంగరంగ వైభవంగా శ్రీ నూకంబిక అమ్మవారు ఉత్సవ మూర్తి ఊరేగింపు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అయిన అనకాపల్లి శ్రీ నూకంబిక అమ్మవారి కొత్తమావాస్య జాతర సందర్భంగా ఈనెల 17న శ్రీ నూకంబిక అమ్మవారి మాల ధారణ సేవా సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున అమ్మవారి ఉత్సవ మూర్తి ఊరేగింపు నిర్వహిస్తున్నట్టు మాలధారణ సంఘం కన్వీనర్, గురు భవాని, పొలిమేర శ్రీను తెలిపారు. భారీ ఎత్తున నిర్వహిస్తున్న ఈ ఊరేగింపు కార్యక్రమంలో తెలంగాణకు చెందిన ఎనిమిది మంది కళాకారులు పొట్టి పోతురాజుల విన్యాసం, కేరళ కళాకారులు కేరళ వాయిద్యాలు, రాజమండ్రి కళాకారులతో అమ్మవారి వేషాలు ,విజయనగరం వారి 15 మంది పులి వేషాలు, పెనుకేరు 40 మంది కళాకారులచే గారడి, ఒడిస్సా కళాకారులతో బలంగిరి బాజా, కర్ణాటక కళాకారులతో తాంబూలం, ఒడిస్సా వారి జై గంటలు, తాడేపల్లిగూడెం వారి పొడవు కాళ్ల మనుషులు, మల్లం వారిచే తప్పుడు గుళ్ళు, చిడతలు, తప్పెటగళ్ళు, మ్యూజికల్ బ్యాండ్, సన్నాయి మేళాలు, తదితర జానపద కళారీతులు చోటుచేసుకుంటాయి. ఊరేగింపులో మాలధారణ భక్తులు ఘటాలు తలపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొంటారు. అలాగే కొందరు భక్తులు శూలాలు వేసుకొని అమ్మవారి పట్ల తమ భక్తి ప్రభత్తులను చాటుకుంటారు. కార్యక్రమానికి అగ్రభాగాన గవరపాలెం కనకదుర్గమ్మ ఆలయం నుండి అమ్మవారి సింహ వాహనం నిలుస్తుంది. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఊరేగింపు కార్యక్రమాన్ని ఆలయ కార్య నిర్వహణ అధికారి చంద్రశేఖర్, వైసిపి నేత దాడి జయ వీర్ ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్టుగానే ఈ ఏడాది కూడా ప్రతిష్టాకరంగా అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. 19వ తేదీన ప్రముఖ వర్తకులు మోహిని దంపతులతో ముత్తైదువులకు వాయనం కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా నిర్వాహకులు భక్తులను కోరారు.

# అనకాపల్లి భూములను సమగ్ర భూ సర్వే నిర్వహించాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి భూములను సర్వే చేసి నేటికీ 70 సంవత్సరములు కావస్తుంది నేడు భూములను రీ- సర్వే చేసి సమగ్ర భూ సర్వే,భూహక్కు పత్రం లు రైతులకు అందించాలని వ్యవసాయ దార్ల సంఘం ప్రతినిధులు జిల్లా అధికారులు ను కోరారు.ఈరోజు జరిగిన సమావేశం నకు విల్లూరి రాము అధ్యక్షత వహించారు. కార్యదర్శి భీశెట్టి కృష్ణ అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర భూ సర్వే సంకల్పించి. వ్యవసాయ భూములతో పాటు ప్రభుత్వం భూములు,పంట కాలువలు, జి.వి.యమ్.సి., ప్రభుత్వ స్థలాలు రోడ్లు వగైరా ఆక్రమించిపక్కా నిర్మాణం చేసిన వారి నుండి రికవరీ చేయుటకుచర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ సర్వే పూర్తి చేయాలి కానీ వారి000 ఆక్రమణ లను గుర్తించి వారి పేర్లను రికార్డుల్లో ఎక్కించరాదు ప్రభుత్వ భూములు ఎక్కువగా ఏరియా ఎరాటగా ఉన్నాయి మరియు ప్రభుత్వ రికార్డుల్లో పూర్వ నాటి పేర్లు ను కాకుండా , ప్రస్తుతం ఉన్న పేర్లు ను ఆధారము లతో గుర్తించాలి.భూమి, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ చేసినవారు వారి యొక్క తాతల పేర్లు ఉన్నాయని ఆక్రమించడానికి అధికారులను కాక పట్టి ప్రస్తుతం రైతులను చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారు.భూమిపై ఉన్న రైతుల పేర్లను సవరణ చేసి యస్.ఎఫ్.ఐ రికార్డు ప్రకారం ఆన్ గ్రౌండ్ సర్వే చేయాలి సర్వేయర్లు కూడా నిజ నిజాలు సేకరణ చేసి గుర్తించి భూములపై డిస్ప్యూట్ ఉన్నట్లుగా/నమోదు చెయ్యకుండారీ సర్వే చేసిన తర్వాత రైతులు రెవెన్యూ కోర్టు లను ఆశ్రయించకుండా న్యాయం చేయాలి.భూములను సర్వే చేసేటప్పుడు నాలుగు దిక్కుల ఉన్న సరిహద్దు రైతుల సమక్షంలో ఎటువంటి వివాదములకు అవకాశం లేకుండా సర్వే పూర్తి చేయాలి.అని అనకాపల్లి వ్యవసాయ దార్ల సంఘం తీర్మానం చేసి జిల్లా కలెక్టర్ గారికి పంపడం జరిగింది. ఈ సమావేశంలో కాండ్రేగుల అప్పారావు కెప్టెన్, కె.వి.సూర్యనారాయణ,మళ్ళ రామ కృష్ణ, కర్రిమోదినాయుడు, కోణతాల శ్రీనివాసరావు, కాండ్రేగుల విశ్వేశ్వర రావు, యమ్ యన్ యస్ అప్పారావు వగైరా రైతులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణులకు బీజేపి వలనే న్యాయం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గాజువాక బ్రహ్మగిరి పై శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శ్రీ మాతా గోవిందమాంబ ఆరాధన మహోత్సవం విశ్వబ్రాహ్మన జిల్లా అధ్యక్షులు బ్రహ్మశ్రీ శివకోటి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘణంగా జరిగింది. ముఖ్య అతిదిగా బీజేపి గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కరణంరెడ్డి నరసింగరావు పాల్గొని ప్రత్యేకపూజలు చేసారు. ఈ సందర్భంగ నరసింగరావు మాట్లాడుతూ మహా యోగి,కాల జ్ఞాని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారసులైన విశ్వబ్రాహ్మణులకు గతంలో దేశ ప్రదాని నరేంద్ర మోదీ కేబినెట్ లో మంత్రి పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పించారని అన్నారు. గత 75 యేల్లలో కేవలం బీజేపి మాత్రమే విశ్వబ్రాహ్మణులను గుర్తించిందని అన్నారు. విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు శివకోటి. శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ కులంలో ఎంతోమంది పేదవారు ఉన్నారని వారికి కేంద్రం తరపున వర్తించే పథకాల ద్వారా సహాయం చేయాలని కేఎన్ఆర్ ని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన కేఎన్ఆర్ జిల్లా రాష్ట్ర పెద్దల దృష్టికి రాజ్యసభ ఎంపి జీవీఎల్ నరసింహారావు గారి దృష్టికి తీసుకొని వెల్లి తనవంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో నాయకులు కాకుమాను వెంకటవేణు, ఎన్.ఎఫ్.డిబి సభ్యులు సిరసపల్లి నూకరాజు ,సీనియర్ నాయకులు బాటా శ్రీను ,మండల అధ్యక్షులు గూటూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.అనంతరం కమిటీ పెద్దలు అతిదులను ఘణంగా సత్కరించారు.

# చిరస్మరణీయులు పొట్టి శ్రీరాములు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అమరజీవి పొట్టి శ్రీరాములు ఒక గొప్ప త్యాగ మూర్తి, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆద్యుడు మహనీయుడు అని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ అన్నారు గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16 న జన్మించి 1952 డిసెంబరు 15న అమరులయ్యారని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి, అమరజీవి యైన మహాపురుషుడని ఆయన త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్రం 1956 నవంబర్1 న ఏర్పడిందని అన్నారు. పొట్టి శ్రీరాములు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించాడని, తర్వాత మళ్ళీ 1941-42 సంవత్సర కాలంలో సత్యాగ్రహాలు, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొనడం వల్ల మూడుసార్లు జైలుశిక్ష అనుభవించాడని అన్నారు. ఆంధ్రులకు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణ భూతుడైనవారని, మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకొరకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడని కొనియాడారు. ఈ మహనీయుని జ్ఞాపకార్థం రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించిందని, నెల్లూరు జిల్లా పేరును 2008లో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మార్చారని, అమరజీవి పొట్టి శ్రీరాములు గారి గౌరవార్థం తపాల శాఖ వారు 2000 మార్చి 16 లో ఒక ప్రత్యేక తపాల బిళ్ళను విడుదల చేసారని, మహనీయుల జయంతి వర్ధంతి కార్యక్రమాల ద్వారా వారి జీవిత విశేషాల నుండి స్ఫూర్తి పొంది యువత సన్మార్గంలో దేశ భక్తితో మెలగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో, సిబ్బంది మరియు వివిధ శాఖల సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి అత్యంత ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణ మెయిన్ రోడ్డు చిన బజార్ వద్ద కొలువైన శ్రీ సీతారామ ఆలయములో ఈ ఏడాది సీతారామ కళ్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. గురువారం ఆలయంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం వ ఆహ్వాన పత్రిక ను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు . ఈనెల 27 తేదీ స్వామివారి పెళ్లిరాట, 30న సీతారామ కళ్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా జరుపుతామన్నారు,

కళ్యాణం రోజున తిరుమల తిరుపతి దేవస్థానంనుండి తీసుకొచ్చిన స్వామివారి ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు, ఉత్సవ విగ్రహాలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. అనంతరం భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వతగౌరవ అధ్యక్షులు కొణతాల జగన్నాథం నాయుడు (జగన్), కొణుతుల నారాయణరావు (మాస్టారు). శాశ్వత కార్యదర్శి సిరసపల్లి సూరిబాబు, శాశ్వత కోశాధికారి దాసిరెడ్డి వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు కామధేనువు జగదీశ్వరరావు (శిల్పి), కార్యదర్శి కుంచా చిన్ను, కోశాధికారి పాముల ప్రసాద్, కన్వీనర్ పచ్చర్ల వెంకట అప్పారావు (బాబు). ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయం 50. 44 లక్షలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రముఖ పుణ్యక్షేత్రం అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయం మండపంలో బుధవారం అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. హుండి ద్వారా భక్తులు సమర్పించిన ముడుపులు మొక్కుబడులు కానుకలు ద్వారా 125 రోజులకు గాను 50 లక్షల 44 వేల 71 రూపాయి నగదు, బంగారం 44.500 మిల్లీగ్రాములు, వెండి 2 కేజీల 40 గ్రాములు వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ హుండి లెక్కింపు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శ్రీధర్ పర్యవేక్షణలో జరిగిందని ఆయన తెలిపారు.

# పరవాడ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** ఏపీడబ్ల్యూజేఎఫ్ పరవాడ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ నూతన కార్యవర్గం పరవాడ పైడిమాంబ ఆలయ ప్రాంగణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నారపిన్ని గణేష్ ( ఏపీ టీఎస్ న్యూస్) అధ్యక్షులుగా ఎన్. రామ్ ( ఐ న్యూస్), ఉపాధ్యక్షులుగా రెడ్డి గోపి ( టీవీ5) ప్రధాన కార్యదర్శిగా పైల శ్రీను ( న్యూస్ వన్ తెలుగు) ఉప కార్యదర్శి శీరం అప్పలరాజు ( మహా న్యూస్) కోశాధికారిగా మామిడి నాగరాజు ( స్వతంత్ర న్యూస్) సభ్యులు, కే. నాయుడు ( హెచ్ఎంటీవీ) విందుల మోహనరావు ( టెన్ టీవీ). ఎన్ సోమేశ్( గరుడ న్యూస్). పి రమేష్ ( ప్రైమ్ న్యూస్) కార్యక్రమంలో అధ్యక్షులు రాము మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సభ్యులందరికీ హామీ ఇచ్చారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు వ్యక్తులు మృతి



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి-గాజువాక జాతీయ రహదారిపై గురువారం ఉదయం అగనంపూడి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఏపీ 33 బి 9166 ఫ్యాషన్ బైక్ పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను వెనుక నుంచి వస్తున్న బొగ్గు లారీ ఢీకొంది. ఈ సంఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రతీ నెలా 14 తేదీన హెల్త్ మేళాలు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ప్రతీ నెల 14వ తేదీన జిల్లా లోని అన్ని హెల్త్ వెల్నెస్ సెంటర్ లలో హెల్త్ మేళాలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా, బాగాది జగన్నాథరావు అన్నారు. నిక్షయ్ దివాస్ సంధర్భంగా సీతానగరం మండలంలోని జోగింపేట, మరిపివలస సబ్ సెంటర్ లలో లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వైఎస్ఆర్ హెల్త్ వెల్నెస్ సెంటర్ లో టి బి అవేర్‌నెస్ అండ్ సర్వీసెస్ అనే థీమ్ ప్రకారం నిక్షయ్ దివాస్ హెల్త్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్వస్త్ మాన్, స్వస్త్ ఘర్ ఆరోగ్యకరమైన మనస్సు ఆరోగ్యకరమైన ఇల్లు అనే టాగ్ లైన్ తో సచివాలయం పరిధి లోని ప్రజలకి టి.బి స్క్రీనింగ్ పరీక్షలు, నమూనా సేకరణ , రవాణా, టి బి కోసం టెలి-కన్సల్టేషన్ సేవలను అప్‌డేట్ చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1907 టిబి వ్యాధి గ్రస్తులు ఉన్నారని, 2015 -2022 కాలంలో 40 శాతం మేరకు కేసులు తగ్గుముఖం పట్టాయని , దేశవ్యాప్తంగా లక్ష మందికి గాను 200 పాజిటివ్ కేసులు నమోదు అవుతుండగా జిల్లాలో లక్ష మందిలో 190 పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నట్లు వివరించారు. నెలకు 1650 నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టి.బి.రహిత జిల్లా లక్ష్యంగా హెల్త్ మేళాలు పనిచేయాలని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టిబి నియంత్రణ అధికారి డా. శ్యామ్ కుమార్, వి హెచ్ సి ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. వినోద్ కుమార్ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు కు ఘన నివాళి అర్పించిన జిల్లా కలెక్టర్



**విజయనగరం:** అమర జీవి పొట్టి శ్రీరాములు ఒక గొప్ప త్యాగ మూర్తి, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆద్యుడు, మహనీయుడు అని సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు.

గురువారం ఉదయం కలెక్టరేట్ ఆడిటోరియంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ సూర్య కుమారి, జె.సి మయూర్ అశోక్ , డి.ఆర్.ఓ గణపతి రావు తదితరులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం జె.సి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16 న జన్మించి 1952 డిసెంబరు 15న అమరులయ్యారని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి, అమరజీవి యైన మహాపురుషుడని, ఆయన త్యాగం ఫలితంగా నే ఆంధ్ర రాష్ట్రం 1956 నవంబర్1 న ఏర్పడిందని అన్నారు. పొట్టి శ్రీరాములు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించాడని, తర్వాత మళ్ళీ 1941-42 సంవత్సర కాలంలో సత్యాగ్రహాలు, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొనడం వల్ల మూడుసార్లు జైలుశిక్ష అనుభవించాడని అన్నారు. ఆంధ్రులకు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణ భూతుడైనవారని, మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకొరకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడని కొనియాడారు. డి.ఆర్. ఓ గణపతి రావు మాట్లాడుతూ మహనీయుల జయంతి వర్ధంతి కార్యక్రమాల ద్వారా వారి జీవిత విశేషాల నుండి స్ఫూర్తి పొంది యువత సన్మార్గంలో దేశ భక్తితో మెలగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారి యశోధన రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు




**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** అమరజీవి పొట్టిశ్రీరాములు చిరస్మరణీయుడని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జయంతి ని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధన కోసం అహర్నిషలు కృషి చేసి ఆంధ్రరాష్ట్ర ఆవిర్భానికి శ్రీకారం చుట్టిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములని కొనియాడారు. ఆంధ్రుల చిరకాల స్వప్నమైన రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణత్యాగంతో అమరజీవియైన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. ఆయన త్యాగం అజరామరం అన్నారు. శ్రీరాములు చేసిన త్యాగం ఫలితంగా దేశ వ్యాప్తంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఆవిర్భావానికి కారణం అయిందని, దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు ప్రయోజనం పొందారని ఆయన వివరించారు. పొట్టి శ్రీరాములు గొప్ప దేశ భక్తుడు అని, మహాత్మా గాంధీ ప్రభావానికి లోనై ఉద్యోగాన్ని వదిలి అనుంగ శిష్యుడిగా చేరారని చెప్పారు. సమాజ సేవలో నిరంతరం భాగస్వామ్యం అవుతూ సామాజిక రుగ్మతలను రూపుమాపుటకు నిరంతరం కృషి చేశారని అన్నారు. అమరజీవి అడుగుజాడలలో నడవాలని, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కృష్ణా జి, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా గ్రామ పంచాయితీ అధికారి బలివాడ సత్యనారాయణ, ముఖ్య ప్రణాళికా అధికారి పి. వీర రాజు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయి కుమార్, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి ఆర్. ఉమా మహేశ్వర రావు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు వైతాళికుడు, సంఘ సంస్కర్త నాళం కృష్ణారావు వర్ధంతి (మార్చి 17)



నాళం కృష్ణారావు బాల సాహిత్యబ్రహ్మ, మధుర కవి. తెలుగు వైతాళికుడు. సంఘ సంస్కర్త. గౌతమీ గ్రంథాలయం స్థాపకుడు."మానవసేవ" పత్రిక సంపాదకులు. స్వాతంత్ర్య సమర యోధుడు, భాషావేత్త. వీరు 1881 జనవరి 18 న నాళం కామరాజు, లక్ష్మమ్మల చివరి సంతానంగా తూర్పుగోదావరి జిల్లా మండపేట గ్రామంలో జన్మించారు. 1911-15 ప్రాంతాలలో ఆయన తొలి తెలుగు సచిత్రమాస పత్రిక 'మానవ సేవ' ను నిర్వహించారు . తన పదిహేడో ఏట రాజమండ్రిలో గౌతమీ గ్రంథాలయాన్ని స్థాపించారు. స్త్రీ విద్యను ప్రోత్సహించారు. బ్రహ్మ మతస్థుడిగా తన గురువు అయిన కందుకూరి వీరేశలింగం పంతులుగారి కన్నా ముందే జంధ్యాన్ని పరిత్యజించారు. చింతా శేషయ్య అనే అట్టడుగు కులస్థుడికి తన యింట్లో నివాసం ఏర్పరిచి బ్రహ్మ మతస్థుడిగా తీర్చిదిద్దారు. ఇతర కులస్థులతో తన పెద్ద కుమారునికి వివాహం జరిపించారు. వితంతు వివాహాలు జరిపించారు. ఆయన సతీమణి నాళం సుశీలమ్మ తమ విదేశీ వస్త్రాలన్నీ దహనం చేసి, మహాత్ముడు రాజమండ్రి వచ్చినప్పుడు ఆయనకు పండ్లరసం అందించారు.భావిభారత పౌరులకోసం తేటగీతులలో కావ్యరచనలు చేశారు.ఆయన రాసిన 'గాంధీ విజయ ధ్వజ నాటకం' (1921), 'గాంధీ దశావతార లీలలు' (1932) గ్రంథాలను బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. పదివేల సామెతలు జాతీయ లోకోక్తులు పేరుతో సేకరించారు. శ్రీకృష్ణరాయ ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని సంకలనం చేశారు. కందుకూరి వీరేశలింగం పంతులుగారు స్థాపించిన హితకారిణీ సమాజానికి, వీరేశలింగ పాఠశాలకు పంతులుగారి తర్వాత జీవితాంతం అధ్యక్షులుగా పనిచేశారు. కృష్ణారావుగారు నిరాడంబరుడు. కీర్తికాంక్షా రహితుడు. 'సేవకే ప్రాధాన్యం ఇచ్చిన మనిషి.తన అనంతరం మానవసేవ చేయాల్సిందిగా, తన తనయ కళాప్రపూర్ణ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ ని పురమాయించారు. కృష్ణారావుగారి ఆశలన్నీ భావిభారత పౌరుల పైనే ఉండేవి. అందుకే ఆయన కావ్యనాయకుడు పిల్లవాడు. వారికి ఆయా 'గోరుముద్దలు', 'మీగడ తరగలు', 'వెన్నె బడుగలు', 'పాల తరగలు' 'తేనె చినుకలు' తినిపించారు. 'వెన్నెల వెలుగులు', 'విరిదండ', 'దీపావళి' పాపాయి' లను అందించారు. పిల్లలపై చూపే మాధుర్య గుణమే ఆయనని మధురకవి అని రాయప్రోలు సుబ్బారావు గారిచే ప్రశంసించింది. తేట తెలుగుకు ఆయన తేటగీతులే చిరునామాలు, క్లుప్తత, శుభ్రత, శ్రావ్యతల మేళవింపునకు అద్దాలు. లలిత లలిత పదాలతో పిల్లల మనసులను చూర గొన్న కృష్ణారావు మంచి భాషావేత్త. బాలసాహిత్య బ్రహ్మగా, తెలుగు బాలబాలికలకు ఆయన ఇచ్చే సందేశాన్ని తాను రచించిన 'జీవన గీతం'లో పొందుపరిచారు. వీరు 1961 మార్చి 17 న మరణించారు.

**డా. జొన్నకూటి ప్రమోద్ కుమార్**
**9490833108.**

# బడ్జెట్ అడ్డుకున్న టీడీపీ ఎమ్మెల్యేలు




**అమరావతి:** ఏపీ అసెంబ్లీలో ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ బడ్జెట్ ప్రసంగం చేస్తున్న సమయంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అసాధారాణ రీతిలో టీడీపీ ఎమ్మెల్యేలు బడ్జెట్ ప్రసంగానికి అడ్డుపడ్డారు. స్పీకర్ పదే పదే విజ్ఞప్తి చేసినా వారు పట్టించుకోలేదు. ఈ దశలో జోక్యం చేసుకున్న సీఎం జగన్..వారిని బయటకు పంపి బడ్జెట్ ప్రసంగం కొనసాగించాలని సభాపతిని కోరారు. దీంతో ఆయన మంత్రికి సంకేతాలు ఇచ్చారు. అనంతరం అసెంబ్లీ వ్యవహారాలమంత్రి బుగ్గన టీడీపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించారు.

బడ్జెట్ ప్రసంగాన్ని అడ్డుకుని సస్పెండైన టీడీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి బయటకు వచ్చి నిరసనకు దిగారు. ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందని, ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా సస్పెన్షన్లు చేస్తున్నారని ప్రభుత్వంపై విమర్శలు చేశారు.ఆర్థిక క్రమశిక్షణ లేని బడ్జెట్ బుగ్గన ప్రవేశపెట్టారని టీడీపీ శాసనసభ పక్ష ఉపనేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆరోపించారు.జగన్ పాలన మోనార్కిజంలా సాగుతోందన్నారు. ఆదాయం ఎంతో ఖర్చు ఎంతో చెప్పలేని పరిస్థితుల్లో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. అప్పులు పట్టించుకోవటం కోసం ప్రజల్ని మోసగిస్తున్నారన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వకపోవడంతో అవి నిర్వీర్యమైపోతున్నాయని బుచ్చయ్య విమర్శించారు.


అసెంబ్లీలో ఎమ్మెల్యేల కోసం నడిచే ఆసుపత్రికే నిధులు లేక మందులు ఇవ్వట్లేదంటే, ఇక ప్రభుత్వాసుపత్రుల పరిస్థితి ఏంటని బుచ్చయ్య ప్రశ్నించారు. బుగ్గన ఆర్థిక శాఖా మంత్రిగా కంటే అప్పుల శాఖా మంత్రిగా పేరు తెచ్చుకున్నారని టీడీపీ శాసనసభ పక్ష ఉపనేత నిమ్మల రామానాయుడు ఆరోపించారు. ప్రభుత్వం చేసిన 9లక్షల కోట్ల అప్పు ఎవరి జేబుల్లోకి వెళ్లిందో సమాధానం చెప్పాలన్నారు. వ్యవసాయ రంగంలో చూపిన కేటాయింపులకు తగ్గట్టు ఖర్చులు లేకనే రైతులు పంటల విరామం ప్రకటిస్తున్నారన్నారు. 3రాజధానులకు 3ఇటుకలు కూడా పెట్టకుండా అమరావతి ని ఆటకెక్కించారని విమర్శించారు.

ప్రభుత్వం రూ.2.79లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టినా రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించారు. బడ్జెట్ లో వాస్తవాలు లేవని అడిగితే తెలుగుదేశం సభ్యుల్ని సస్పెండ్ చేశారన్నారు.వైకాపా ప్రభుత్వం ప్రవేశపెట్టిన చిట్ట చివరి బడ్జెట్ కూడా మోసపూరితమేనన్నారు. ఘనంగా కేటాయింపులు చూపుతూ ఖర్చు మాత్రం భూతద్దంలో వెతికినా కనిపంచని విధంగా ఉన్న గత బడ్జెట్ ల నుంచి గుణపాఠాలు నేర్చుకోలేదన్నారు. శస్త్ర చికిత్స విజయవంతం రోగి మృతి అన్నట్లుగా బడ్జెట్ ను రూపొందించారన్నారు. కమీషన్ల కోసమే సాగునీటి రంగానికి రూ.22వేల కోట్ల కేటాయింపులు చూపారన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రారంభించిన 2ప్రాజెక్టులు తెదేపా ప్రభుత్వ హయాంలో 90శాతం పనులు పూర్తి చేసుకున్నవే అన్నారు. 6లక్షల పై చిలుకు ఉద్యోగాలు కల్పించినట్లు సిగ్గులేకుండా అసత్యాలు చెప్పారన్నారు.

# తమ్ముడు పై హత్య యత్నం కేస్‌లో అన్నకు రిమాండ్



**రావికమతం, (విశాఖ సమాచారమ్):** మండలంలో మెడివాడ శివారు అప్పలమ్మ పాలెం లో కీ చెందిన మడక సింహాద్రి నాయుడు పై తన అన్న వెంకట రమణ హత్యయత్నం చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయం పై రావికమతం సబ్ ఇన్స్పెక్టర్ ఉమా మహేశ్వరరావు అందించిన వివరాలు ఇలాగ ఉన్నాయి. సోమవారం ఉదయం సింహాద్రి మెడివాడ గ్రామం కీ వస్తుండగా నూకాలమ్మ ఆలయం వద్ద ట్రాక్టర్ తో గుద్ది హతమార్చే ప్రయత్నం చేసాడు. ఆ సమయం లో సింహాద్రి కుడి చెయ్యి విరిగిపోయి, గాయాలు అవడం తో చికిత్స నిమిత్తం నర్సీపట్నం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కీ తరలించడం జరిగింది. ఈ విషయ%శీ% పై రావికమతం ఎస్ఐ ఉమామహేశ్వరరావు సింహాద్రి దగ్గర నుండి స్టేట్మెంట్ తీసుకొని కేస్ బుక్ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం వెంకట రమణ ని అరస్ట్ చేసి చోడవరం లో జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్ట్ కు తరలించగా కోర్ట్ 15 రోజులు రిమాండ్ విధించడం జరిగిందన్నారు.



## గాలి కుంట వ్యాధి నివారణ టీకాలు



**రావికమతం, (విశాఖ సమాచారమ్):** మండలంలో పశు సంవర్ధన శాఖ ఆధ్వర్యంలో పాడి పశువుల్లో గాలి కుంట వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమాన్ని రావికమతం ఎంపీపీ పైల రాజు తోటకూర పాలెం లో ప్రారంభించారు. తట్టబంధ, కొత్తకోట, పశువైద్యులు పర్యవేక్షణ లో రెండు బృందలు ద్వారా మండలం వ్యాప్తంగా అన్ని గ్రామల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. పాడి పశువుల్లో గర్భ స్రావం,పెయ్యిలో మరణాలు, ఉత్పత్తి లో తగ్గుదల తదితర ధుస్పరిమానాలు కు గాలి కుంట వ్యాధి ప్రధాన కారణం కావడం మన దేశం నుండి ఈ వ్యాధి శాశ్వతం గా నిర్మూలించేందుకు కేంద్రం ప్రభుత్వం జాతీయ పశు వ్యాధి నివారణ కార్యక్రమం న్ని ప్రారంభించిన కొత్తకోట, తట్టబంధ పశువైద్యులు డాక్టర్ సుకేశ్వరావు, బాల తేజ తెలిపారు. గ్రామాల్లో 80%శాతం పశువులకు వ్యాధి నిరోధిక టీకాలు చేసినట్టులయితే ఈ వ్యాధి పూర్తిగా తరిమి వేయబడు తుందని ఈ అవకాశంన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అభ్యుదయ రైతులు ఈ కార్యక్రమం ము ఖ్యద్దేశాం రైతులుకు తెలియజేయాలనీ ఎంపీపీ పైల రాజు తెలిపారు.

## మార్చి 17న చలో కలెక్టరేట్ జయప్రదం చేయండి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ మరియు పర్మనెంట్ కార్మికుల సమస్యలపై గురువారం సిఐటియు జిల్లా నాయకులు కార్మికులతో కలిసి రేపు జరగబోవు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జీవి రమణ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగాల పర్మినెంటు, సంక్షేమ పథకాలు అమలు, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ మరియు రిస్క్ అలవెన్స్ ,క్లాప్ ఆటో డ్రైవర్లకు 18,500 జీతం, పర్మినెంట్ కార్మికులకు జిపిఎఫ్ అకౌంట్స్ హెల్త్ కార్డులు, ప్రమోషన్స్ డిమాండ్ల సాధనకై ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నాగవంశం శంకర్రావు, మామిడి శివ,నాగవంశం నిర్మల,బంగారి రాజేష్, మామిడి శివప్రసాద్, నాగవంశంమల్లేష్, తాతబాబు, చిన్నికృష్ణ, నాగరాజు, ఉమా,రాజేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## హెచ్.ఐ.వి/ఎయిడ్స్‌పై అవగాహన



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ మరియు సాతి స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా పార్వతీపురం సబ్ జైల్ లో హెచ్.ఐ.వి/ఎయిడ్స్, సుఖవ్యాధులపై గురు వారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమములో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (ఎయిడ్స్ మరియు లెప్రసి) డా. శ్యామ్ కుమార్ మాట్లాడుతూ హెచ్.ఐ.వి/ఎయిడ్స్ తమ జీవితాలలోనికి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉండుటకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని ప్రతి ఒక్కరూ నమ్మాలని సూచించారు. జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పి. బాలాజీ హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో సబ్ జైల్ సూపరింటెండెంట్ అప్పలనారాయణ, ఐ.సి. టి.సి కౌన్సిలర్ కృష్ణ మూర్తి, జిల్లా ఆసుపత్రి సుఖ వ్యాధి చికిత్స కేంద్రం కౌన్సెలర్ యు.రామారావు, సాతి ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ఎస్. మేనక పాల్గొన్నారు.

## వరుసగా మూడవరోజు అసెంబ్లీ సమావేశాలలో పాల్గొన్న పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ఈనెల 14వ తేదీన ప్రారంభం అయిన ఏపీ అసెంబ్లీ సమావేశాలు నేటికీ మూడవ రోజుకు చేరుకోగా వరుసగా 3వ రోజు సమావేశాలలో పాల్గొన్న పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అలజంగి జోగారావు . నేడు అసెంబ్లీలో ఆర్థిక మంత్రిచే రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం భోజనం విరామం సమయంలో అసెంబ్లీ ఆవరణంలో మాజీ మంత్రి పర్యులు పేర్ని నాని గారిని మర్యాద పూర్వకంగా కలుసుకున్న ఎమ్మెల్యే కాసేపు వారితో మాటా మంతి ముచ్చటించడం జరిగినది. ఈ ఆత్మీయ కలయికలో ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకులు పోల ఈశ్వర నారాయణ మరియు యువ నాయకుడు సంఘం రెడ్డి సందీప్ కుమార్ ఉన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన స్థానిక సంస్థల కౌంటింగ్ ప్రక్రియ



**శ్రీకాకుళం:** స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుల ఓట్ల లెక్కింపు ప్రక్రియ శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ప్రశాంతంగా ముగిసింది.

జిల్లాలో పట్టభద్రుల శాసనమండలి సభ్యుల ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుల ఎన్నికలు ఈ నెల 13న జరిగిన సంగతి విదితమే. స్థానిక సంస్థలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 776 ఓటర్లకు గాను శ్రీకాకుళం రెవిన్యూ డివిజనులో 233 మంది, పాలకొండలో 149 మంది, టెక్కలిలో 161 మంది, పలాస రెవిన్యూ డివిజనులో 209 మంది వెరశి 752 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సులను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూముకు తరలించి సీల్ చేయడం జరిగింది. ఓట్ల లెక్కింపు నేడు కావడంతో పౌర సరఫరాల కమీషనర్ మరియు ఎన్నికల పరిశీలకులు హనుమంతు అరుణ్ కుమార్, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేశ్ లాఠకర్, సంయుక్త కలెక్టర్ మరియు రిటర్నింగ్ అధికారి యం.నవీన్ సారథ్యంలో స్ట్రాంగు రూమును తెరచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 08.00గం.లకు ప్రారంభించారు. ఇందులో వై.యస్.ఆర్.సి.పి అభ్యర్థి నర్తు రామారావుకు 632 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి ఆనెపు రామకృష్ణకు 108 ఓట్లు, చెల్లని ఓట్లు 12 వచ్చినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. దీంతో వై.యస్.ఆర్.సి.పి అభ్యర్థి నర్తు రామారావు విజయం సాధించినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటిస్తూ ఎం.ఎల్.సి అభ్యర్థిగా ఫారంను అందజేసారు.

## విద్యార్థుల ఆరోగ్యం పై అప్రమత్తం గా ఉండాలి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** విద్యార్థులు ఆరోగ్యం పై అవగాహన ద్వారా చాలా వరకు వ్యాధులను దరి చేరకుండా చేయవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డి ఐ ఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన నర్సిపురం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు రక్త హీనత,సీజనల్ వ్యాధులు, పరిశుభ్రత, రోగనిరోధశక్తి పలు అంశాలపై ఆరోగ్య అవగాహన కల్పించారు.

రక్తహీనతను ప్రాథమికంగా ఎలా గుర్తించాలి,వాటి లక్షణాలను వివరించారు. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉండటం వల్ల కలిగే అనారోగ్య సూచనలు వివరించి వాటి నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని అవగాహన కల్పించారు. అదేవిధంగా లక్షణాలు గుర్తించిన కొంత మంది విద్యార్థులకు వైద్య సిబ్బందిచే హిమోగ్లోబిన్ పరీక్షలను చేయించి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు మ్రింగించారు. ఈ వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. వేసవికాలంలో వచ్చే అనారోగ్య లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉష్ణోగ్రతల వలన శరీరంలో నీటి శాతం తగ్గకుండా విద్యార్థులు ఎప్పటికప్పుడు నీరు త్రాగాలని సూచించారు. అదేవిధంగా పరిశుభ్రత, రోగనిరోధశక్తి పలు అంశాలపై అవగాహన కల్పించి తద్వారా చాలా వరకు రోగాలను దూరం చేయవచ్చని డిఐఒ జగన్మోహనరావు సూచించారు.

వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది సమన్వయంతో విద్యార్థుల ఆరోగ్యం పై శ్రద్ధ చూపాలని ఈ సందర్భంగా అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె. వెంకటనాయుడు, సూపర్ వైజర్ జాయగౌడ్ , వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేసవి తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి




**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** వేసవి తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్.జవహర్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్లతో గురు వారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందని అందుకు అనుగుణంగా జిల్లా స్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. రేయింబవళ్లు పనిచేసే కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. నిత్యము పర్యవేక్షణ చేయాలని అందుకు ఒక నోడల్ అధికారిని నియమించాలని ఆయన చెప్పారు. అవసరమగు ప్రదేశాలు గుర్తించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, మందులు సిద్దంగా ఉంచాలని ఆయన అన్నారు. పాఠశాలల పని వేళలు మార్పు వంటి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల్లో ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు ఉంచాలని ఆయన పేర్కొన్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. విద్యుత్ సరఫరా సమర్థవంతంగా చేయుటకు విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లో వాలంటీర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు. గృహ నిర్మాణ పనులు గుర్చి అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ గృహాల దశల మార్పు పనులలో పార్వతీపురం మన్యం జిల్లా మంచి ప్రగతి కనబరిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ , పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్. కృష్ణా జి, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, జిల్లా గ్రామ పంచాయితీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా పశు సంవర్థక అధికారి డా. ఏ. ఈశ్వర రావు, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం, జిల్లా మత్స్య శాఖ అధికారి వేమూరి తిరుపతయ్య, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె. రాజ కుమార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భాజాపా, వైకాపాలను ఇంటికి సాగనంపే సమయం ఆసన్నమైంది



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** కేంద్రంలో మతోన్మాద, రాష్ట్రంలో నియంతృత్వ పరిపాలన సాగిస్తున్న బిజెపి, వైకాపాలను ఇంటికి సాగనంపే సమయం ఆసన్నమైందని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ అన్నారు. ఆ పార్టీ చింతపల్లి మండల కార్యదర్శి పేట్ల పోతురాజు ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సమితి సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న మతోన్మాద బిజెపిని, రాష్ట్రంలో నియంతృత్వ పరి పాలన చేస్తున్న వైకాపా ప్రభుత్వాలను 2024 సార్వత్రిక ఎన్నికలలో ఇంటికి సాగనంపేందుకు బిజెపి, వైకాపాయేతర పార్టీలన్నీ సమాయత్వం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. 13 లక్షల కోట్ల రూపాయలు ఎగ్గొట్టిన అదానీని ప్రధాని నరేంద్ర మోడీ వెనకేసుకు రావడం విడ్డూరం అన్నారు. బిజెపి యేతర రాష్ట్రాలలో పరిపాలన సాగిస్తున్న వారిని లొంగదీసుకునే పనిలో ఈ డీ, సి.బి.ఐ, ఇతర నిఘ వ్యవస్థలనే గాక, న్యాయ వ్యవస్థలను సైతం ప్రభావితం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని, అదే పందాలో వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కూడా నియంతృత్వ పోకడతో పరిపాలన సాగిస్తూ నాడు విభజన చట్టంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించలేని స్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటర్లకు డబ్బులు ఆశ చూపడమే గాక, 6, 7, 8 తరగతులు చదివిన వారిని కూడా ఓటర్లుగా నమోదు చేయించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన ఘనత వైకాపాకే దక్కుతుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని గొంతు నొక్కే విధంగా జీవోలను తీసుకువచ్చి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష, లౌకిక పార్టీలన్నీ సమన్వయంతో ఎదురుకోవలసిన తరుణం ఆసన్నమైందన్నారు. ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు బిజెపి, వైకాపాల తీరు పై ప్రజలను చైతన్యవంతులను చేయవల సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు సిగ్గే కొండలరావు, సుంకర విష్ణుమూర్తి, మొట్టడం రాజబాబు, జల్లి రాజబాబు, ఇంగువ రామారావు, గంజారి రమణ, అమర్, కొర్ర గోపాలరావు, కంకిపాటి సత్తిబాబు. అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు 123 వ జయంతి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అమర్ జీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి ఉత్సవాలు మెయిన్ రోడ్ లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఘనంగా జరిగాయి పి ఎం ఎల్ నరసింహం (మూర్తి) . ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసిల్దార్ గంగాధర్ పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర కోసం ప్రాణాలు త్యాగం చేశారని, అందరూ ఆయన ఆశయాలు పాటించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో. వాసవి మిత్ర కేసిజిఎఫ్ క్లబ్ అధ్యక్షుడు బండారి మోహన్, ఎమ్మార్ నాగేశ్వరరావు, ప్రోగ్రాం చైర్మన్ గంగుపాం నాగేశ్వరరావు, తాడి రామకృష్ణ, వాసవి క్లబ్ అధ్యక్షులు నాగవరం ప్రసాద్, రత్నాజీ, క్లబ్ సభ్యులు తదిరు పాల్గొన్నారు

## విదేశాల్లో నివసించే భారతీయులకు త్వరలో అక్కడే మన ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం

ఎన్ఆర్ఐ ఓటర్ల కోసం ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీబీపీఎస్)ను అమలు చేసేందుకు పరిశీలనలో ప్రతిపాదన: బీజేపీ రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావు ప్రశ్నకు కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజేజు జవాబు.

రాజ్యసభ ఎంపి శ్రీ జీవీఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తు కేంద్ర న్యాయశాఖ మంత్రి శ్రీ కిరణ్ రిజేజు, 1 జనవరి 2023 నాటికి, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్ 20ఎ ప్రకారం విదేశాల్లో నివసిస్తున్న 1.16 లక్షల (1,15,696) భారతీయ పౌరులు భారతీయ ఓటర్ల జాబితాలో ఓటర్లుగా నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు.

విదేశీ ఓటర్ల కోసం ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని అమలు చేయడానికి ఎన్నికల ప్రవర్తన నియమాలు, 1961ను సవరించే ప్రతిపాదనను భారత ఎన్నికల సంఘం చేపట్టిందని న్యాయమంత్రి కిరెన్ రిజేజు తెలిపారు. ప్రతిపాదన అమలులో ఉన్న లాజిస్టికల్ సవాళ్లను పరిష్కరించేందుకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో ఈ విషయం చర్చిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

విదేశీ ఓటర్లు వ్యక్తిగతంగా లేదా ప్రాక్సీ (నామినేటెడ్ ఓటరు) ద్వారా ఓటు వేయడానికి వీలుగా ప్రజాప్రాతినిధ్య (సవరణ) బిల్లు, 2018 పేరుతో భారత ఎన్నికల సంఘం సిఫార్సు చేసిన బిల్లును ఆగస్టు 9, 2018న లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదించినట్లు న్యాయ మంత్రి తెలిపారు. 16వ లోక్‌సభ రద్దు కారణంగా ఈ బిల్లు రద్దు చేయబడిందని తెలిపారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



**విజయనగరం:** ఇంటర్ పరీక్షా కేంద్రాలను రెండో రోజు కూడా, జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి తనిఖీ చేశారు. కొత్తవలసలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వాగ్దేవి జూనియర్ కళాశాలను గురువారం కలెక్టర్ పరిశీలించారు. పరీక్షకు చేసిన ఏర్పాట్లపై ప్రిన్సిపాల్‌ను ఆరా తీశారు. త్రాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్ల ఏర్పాటుపై ప్రశ్నించారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూడాలని, పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ఐఓ మూడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా, 8 పరీక్షా కేంద్రాలను డిఈసి తనిఖీ చేశారు. వీరే కాకుండా స్క్వాడ్ బృందాలు, ఇతర అధికారులు సైతం విస్తృతంగా తనిఖీలను నిర్వహించారు.

1122 మంది గైర్హాజరు

రెండోరోజు ఇంటర్ పరీక్షలకు 1122 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షకు 19250 మంది సాధారణ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 18,445 మంది హాజరయ్యారు. 805 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 4414 మంది హాజరవ్వాల్సి ఉండగా, 4097 మంది మాత్రమే హాజరయ్యారు. 317 మంది హాజరు కాలేదు. మొత్తంమీద 1122 మంది రెండోరోజు పరీక్షలకు గైర్హాజరయ్యారు. చూసిరాతలకు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీసు కేసులను నమోదు చేశారు.

## రీసర్వేపై రైతులకు పూర్తి అవగాహన



**అనకాపల్లి/రావికమతం, (విశాఖ సమాచారమ్):** గ్రామాలలో జరిపిన భూముల రీ సర్వే గురించి రైతులకు క్షుణ్ణమైన అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి అధికారులను ఆదేశించారు. గురువారం రావికమతం మండలం గుమ్మాలపాడు గ్రామాన్ని సందర్శించి సర్వే రికార్డులను పరిశీలించారు. అక్కడ ఉన్న రైతులతో ఆమె మాట్లాడారు. సర్వే పై అభ్యంతరాలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తరువాత అక్కడ ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి గర్భిణులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ అప్పారావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సతీష్, స్థానిక సర్పంచ్ మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కీళ్ళ నొప్పులు ఉన్నాయా..



ఓ ఇబ్బందికర సమస్య. దీని వల్ల చాలా ఇబ్బందులు ఉంటాయి. దీని వల్ల డెయిలీ లైఫ్ కూడా కష్టంగా అనిపిస్తుంది. ఇది ఓ రకమైన ఆటో ఇమ్యూన్ అండ్ ఇన్‌ఫ్లమేటరీ సమస్య. దీని కారణంగా ఇమ్యూనిటీ దెబ్బ తింటుంది. దీంతో పాటు అనేక సమస్యలు వస్తాయి.

**ఆర్థరైటిస్ ఎందుకొస్తుంది..** ఆర్థరైటిస్ ఎందుకొస్తుందనే విషయంలో చాలా పరిశోధనలు జరిగాయి.

ఏ వయసులోనైనా ఈ సమస్య వస్తుంది. కానీ, ఎక్కువగా పెద్దవారికి ఈ సమస్య వస్తుంది.

మహిళలకి ఎక్కువగా ఈ సమస్య వస్తుంది.

ధూమపానం చేసేవారికి సమస్య ఎక్కువ.

అదే విదంగా, బరువు ఎక్కువగా ఉన్నవారికి కూడా సమస్య ఎక్కువగా వస్తుందని చెబుతున్నారు.

**లక్షణాలు..** రుమటాయిడ్ ఆర్థరైటిస్ బాడీని ప్రభావితం చేస్తుంది. కాబట్టి, ఇది అనేక లక్షణాలను చూపిస్తోంది.

కీళ్ళ నొప్పి, కీళ్ళు గట్టిగా మారడం, వాపు, బరువు తగ్గడం, జ్వరం, అలసట, బలహీనతలు ఉంటాయి.

**కీళ్ళనొప్పులు..** రుమటాయిడ్ ఆర్థరైటిస్ వచ్చినప్పుడు కీళ్ళ సమస్యలు ఉంటాయి. శరీరంలో మంట ఉంటుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్ ఉంటే అనేక లక్షణాలు ఉంటాయి. వీటిని ముందుగానే గుర్తించడం వల్ల సమస్య గురించి తెలుసుకోవచ్చు.

**ట్రీట్‌మెంట్ చేయకపోతే..** ఆర్థరైటిస్ ఉంటే చేతులు, మణికట్టు, మోకాళ్ళు కీళ్ళు ప్రభావితమవుతాయి. నొప్పులుగా ఉంటాయి. దీని వల్ల వాపు, మంట ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల కణజాలం దెబ్బతిని నొప్పులు సమస్యగా ఉంటుంది. దీనికి ట్రీట్‌మెంట్ చేయకుండా వదిలేస్తే మోచేతులు, తుంటి, భుజాలు, కాళ్ళు, చేతులకే కాకుండా ఇతర భాగాలకు కూడా సమస్య ఉంటుంది.

**ఊపిరితిత్తులపై కూడా ఎఫెక్ట్..?** రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనేది శరీరంలో అన్ని కణజాలాలపై ఎఫెక్ట్ చూపిస్తుంది. ఊపిరితిత్తులు, గుండె, కళ్ళపై కూడా సమస్య చూపిస్తుంది.

**వాస్కులైటిస్..** రుమటాయిడ్ ఆర్థరైటిస్ ఉంటే ముఖ్యంగా కీళ్ళపై ఎఫెక్ట్ పడుతుంది. దీని వల్ల రక్తనాళాలు వాపుగా ఉంటాయి. దీనినే వాస్కులైటిస్ అంటారు. ఎక్కువ రోజులు ఆర్థరైటిస్‌తో బాధపడితే ఈ సమస్య వస్తుంది. దీని వల్ల చర్మం, వేళ్ళు, కాలి నరాలు, కళ్ళతో పాటు గుండె నాళాలపై కూడా ఎఫెక్ట్ పడుతుంది. సెడార్స్ సినాయ్ ప్రకారం ఆర్థరైటిస్‌కి ట్రీట్‌మెంట్ చేయకుండా వదిలేస్తే అది ప్రాణాంతకంగా మారుతుంది.

**నరాలు దెబ్బతినడం..** ఆర్థరైటిస్ సమస్య కారణంగా నాడీ వ్యవస్థలోని భాగమైన నరాలను దెబ్బతీస్తుందని తెలుస్తోంది. ఈ పరిస్థితి కారణంగా నరాలపై ఒత్తిడి పెరుగుతుంది. కార్పల్ టన్నెల్ సింద్రోమ్, బలహీనత, తిమ్మిరి, బొటనవేలు, మధ్యవేళల్లో తిమ్మిరిగా ఉంటుంది.

డిప్రెషన్, కొన్ని సమస్యలు, మానసిక సమస్యల కారణంగా ఆర్థరైటిస్ వస్తుంది. అంతేకాకుండా, మానసిక సమస్యలు ఉన్నవారు ట్రీట్‌మెంట్‌కి తక్కువ ప్రతిస్పందిస్తారని తెలుస్తోంది.

**గుండె సమస్యలు కూడా..** రుమటాయిడ్ ఆర్థరైటిస్ ఒకటి, ఇతర కీళ్ళలో వాపు ఉంటుంది. ఇది గుండె సమస్యలకి కూడా కారణమవుతుంది. గుండెపోటు, పక్షవాతం, గుండె దడ, హార్ట్ ఫెయిల్యూర్, గుండె సమస్యలకి కారణమవుతుంది.

# థైరాయిడ్ పేషెంట్స్.. వేసవి కాలంలో ఈ పండ్లు తింటే మంచిది..!



ఎండాకాలం మొదలైంది. సీజనల్ మార్పుల కారణంగా.. థైరాయిడ్ పేషెంట్స్ లక్షణాలు తీవ్రం అవుతాయి. వేసవిలో సహజంగా డీహైడ్రేషన్ ఎక్కువగా ఉంటుంది. థైరాయిడ్ సమస్యతో బాధపడేవారిలో వేసవిలో అలసట, నిస్సత్తువ, డీహైడేషన్ వంటి సమస్యలు వేధిస్తూ ఉంటాయి. వేసవి కాలంలో థైరాయిడ్ స్థాయిలను కంట్రోల్‌లో ఉంచుకోవడానికి, మీ శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడానికి తీసుకోవలసిన పండ్లు.

**పైనాపిల్..** పైనాపిల్‌లో విటమిన్ బి, సి, మాంగనీస్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పండులో ఉండే విటమిన్ బి మీ శరీరానికి శక్తిని అందిస్తుంది. దీనిలోని విటమిన్ సీ యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. కాల్షియం శోషణకు, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నిర్వహించడానికి, నరాల పనితీరును మెరుగుపరచడానికి మాంగనీస్ కీలక పాత్ర పోషిస్తుంది. థైరాయిడ్ పేషెంట్స్‌కు బలహీనత, అలసట సాధారణం. విటమిన్ బి అలసటను దూరం చేస్తుంది. పైనాపిల్‌లో ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి థైరాయిడ్ లక్షణాలు తగ్గించడంలో సహాయపడతాయి. పైనాపిల్‌ను ఉదయం ఖాళీ కడుపుతో తినవచ్చు. ఇది ప్రొటీన్లను విచ్ఛిన్నం చేస్తుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. భోజనం తర్వతా పైనాపిల్ తినవద్దు, భోజనానికి అరగంట ముందు తీసుకోవచ్చు.

100 గ్రాముల పైనాపిల్‌లో ఈ పోషకాలు ఉంటాయి.

కేలరీలు: 82 కిలో కేలరీలు. డైటరీ ఫైబర్: 2.3 గ్రా. కొవ్వు: 0.20 గ్రా. ప్రోటీన్: 0.89 గ్రా. పొటాషియం: 109 మి.గ్రా. కార్బోహైడ్రేట్లు: 13 గ్రా. విటమిన్ బి: 5%. విటమిన్ సి: 79%.

**ఆరెంజ్..** ఆరెంజ్‌లో విటమిన్ సీ మెండుగా ఉంటుంది. హైపో థైరాయిడిజంతో బాధపడేవారు.. ఆరెంజ్ ఎక్కువగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. విటమిన్ సీ రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. శరీరంలో ఒత్తిడి హార్మోన్ స్థాయిలను నియంత్రిస్తుంది. ఆందోళన, రక్తపోటు, డిప్రెషన్ వంటి సమస్యలను నివారిస్తుంది. మీ సలాడ్‌లో ఆరెంజ్ తీసుకోవచ్చు. ఆరెంజ్‌ను భోజనం తర్వాత.. అల్పాహారంగా తీసుకోవచ్చు.

100 గ్రాముల ఆరెంజ్‌లో ఈ పోషకాలు ఉంటాయి..

కేలరీలు - 147 కిలో కేలరీలు. ఫైబర్: 3 గ్రా. ప్రోటీన్: 1 గ్రా. చక్కెర: 12 గ్రా. విటమిన్ ఎ: 1%. విటమిన్ సి: 64%. కాల్షియం: 6.4 మి.గ్రా. పొటాషియం: 181 మి.గ్రా. నీరు: 84%.

**బెర్రీస్..** బ్లూ బెర్రీస్.. థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. బెర్రీస్‌లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు మెండుగా ఉంటాయి. ఇందులో ఉండే ఫ్లేవనాయిడ్ కంటెంట్ సమృద్ధిగా ఉంటాయి. ఇది మెదడులోని ప్రోటీన్లు, ఎంజైమ్‌ల ఉత్పత్తి ప్రోత్సహించి, మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. బెర్రీస్‌లో ఎల్లాజిక్ యాసిడ్ ఉంటుంది. ఇది యాంటీఆక్సిడెంట్‌గా పనిచేసి, క్యాన్సర్ కణాలను నియంత్రిస్తుంది. దీనిలోని యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు.. థైరాయిడ్ పేషెంట్స్‌కు మేలు చేస్తాయి. థైరాయిడ్ డిజార్డర్ ప్రమాదాన్ని నివారిస్తుంది. థైరాయిడ్ ఉన్నవారు లంచ్ , డిన్నర్‌లో కొన్ని బెర్రీలను తీసుకోవచ్చు. స్నాక్స్‌గా కూడా తినవచ్చు.

100 గ్రాముల బెర్రీలలో ఈ పోషకాలు ఉంటాయి.. కేలరీలు: 43 కిలో కేలరీలు. విటమిన్ సి: 35%. మాంగనీస్: 32%. విటమిన్ %ఖ: 25%. రాగి: 8%. ఫోలేట్: 6% కలిగి ఉంటుంది.

**ఆపిల్..** యాపిల్ శరీరాన్ని డిటాక్స్ చేయడానికి సహాయపడుతుంది. యాపిల్‌లో విటమిన్ ఎ సమృద్ధిగా ఉంటుంది. ఇది థైరాయిడ్ థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ల సంశ్లేషణ, విడదలను నియంత్రిస్తుంది. యాపిల్స్‌లో ఉండే ఫైబర్ మిమ్మల్ని ఎక్కువ కాలం సంతృప్తిగా ఉంచుతుంది. బరువు పెరగకుండా ఉండటానికి సహాయపడుతుంది.


100 గ్రాముల యాపిల్‌లో ఈ పోషకాలు ఉంటాయి..

కేలరీలు: 52 కిలో కేలరీలు. కార్బోహైడ్రేట్లు: 13.8 గ్రా. ఫైబర్: 2.4 గ్రాములు. కొవ్వు: 0.2 గ్రాములు. ప్రోటీన్: 0.3 గ్రా. చక్కెర: 10.4 గ్రాములు. నీరు: 86%. విటమిన్ సి: 14% (రోజువారీ విలువ తీసుకోవడం). విటమిన్ కె: 5%.

**అరటిపండు..** అరటిపండ్లు అన్ని సీజన్లలో లభిస్తాయి. అరటిపండ్లలో సెలీనియం మండుగా ఉంటుంది. ఇది థైరాయిడ్ గ్రంధి పనితీరును మెరుగుపరుస్తుంది. సెలీనియంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. అరటిపండ్లు మీ కణాలను ఫ్రీ రాడికల్స్ దెబ్బతినకుండా కాపాడుతుంది. థైరాయిడ్ ఉన్నవారు రోజుకు మీడియం సైజులో ఉన్న 2 అరటిపండ్లు తినవచ్చు. ఇది మీకు రోజంతా కావాల్సిన శక్తిని ఇస్తుంది.

100 గ్రాముల అరటిపండులో ఈ పోషకాలు ఉంటాయి.. కేలరీలు: 89 kCal. కార్బోహైడ్రేట్లు: 22.84 గ్రా. డైటరీ ఫైబర్: 12.23 గ్రా. కొవ్వు: 0.33 గ్రా. ఫ్రక్టోజ్: 2.6 గ్రా. పొటాషియం: 358 గ్రా. ప్రోటీన్: 1.09 గ్రా. విటమిన్ బి: రోజువారీ విలువలో 4%. విటమిన్ సి: 8.04.

## హెచ్3ఎన్2 వైరస్‌తో కిడ్నీలపై తీవ్ర ప్రభావం!



దేశవ్యాప్తంగా ప్రస్తుతం కొత్త వైరస్ కలకలం సృష్టిస్తోంది. కరోనా పీడ ఇంకా పూర్తిగా వదలకముందే ఈ కొత్త వైరస్ తన ప్రతాపం చూపిస్తోంది. హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా గా పిలిచే ఈ వైరస్ సోకడం వల్ల ఇప్పటి వరకు పదుల సంఖ్యలో జనాలు ప్రాణాలు కోల్పోయారు. ఆసుపత్రులో చేరుతున్న వారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతూ వస్తోంది. కొవిడ్-19 తర్వాత దేశంలో హెచ్3ఎన్2 కేసులు భయాందోళన కలిగిస్తున్నాయి. ఈ ఫ్లూ లక్షణాలు తేలికగానే ఉంటున్నా.. ఇప్పటికే అనారోగ్య సమస్యలు ఉన్న వారికి మాత్రం ఇది ప్రాణాపాయంగా మారుతోంది.

శిశువులు, వృద్ధుల్లో హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా వైరస్ తీవ్రంగా ప్రభావం చూపిస్తోంది. వారిపైనే దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ కొత్త ఇన్‌ఫ్లూయెంజాను అరికట్టడానికి కరోనా సమయంలో పాటించిన జాగ్రత్తలు అన్నీ పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

హెచ్3ఎన్2 కేసులు పెరుగుతుండటం వల్ల కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి మార్చి 16 నుండి మార్చి 26 వరకు విద్యా సంస్థలన్నింటికీ అక్కడి ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ముఖ్యంగా 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు 10 రోజుల పాటు పాఠశాలలను పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది.

**కిడ్నీలపై ప్రభావం చూపిస్తున్న హెచ్3ఎన్2:** హెచ్3ఎన్2 వైరస్ వల్ల కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. హెచ్3ఎన్2 వైరస్ సోకితే స్వల్ప లక్షణాలే కనిపిస్తున్నప్పటికీ.. కిడ్నీలపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటున్నట్లు గుర్తించారు. వృద్ధులతో పాటు డయాబెటిస్, హైపర్ టెన్షన్, గుండె సంబంధిత వ్యాధులు, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారిపై హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటున్నట్లు కనుగొన్నారు. ఈ కొత్త ఫ్లూ బారిన పడ్డ వారిలో కిడ్నీల పనితీరు దెబ్బతినడం సహా కిడ్నీ ఫెయిల్యూర్ కేసులు నమోదవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. కిడ్నీ మార్పిడి, డయాలసిస్ రోగులపై ఈ ఇన్‌ఫ్లూయెంజా మరింత ఎక్కువగా ప్రభావం చూపిస్తున్నట్లు హెచ్చరిస్తున్నారు. వయస్సు పైబడిన వారిలో ఈ ముప్పు మరింత ఎక్కువగా ఉందని చెబుతున్నారు.

**ఇన్‌ఫ్లూయెంజా టీకా:** సీకేడీ లేదా డయాలసిస్, పోస్టు కిడ్నీ మార్పిడి రోగులు తీవ్రమైన సమస్యలను నివారించాడనికి వార్షిక ఇన్‌ఫ్లూయెంజా టీకా, కిడ్నీ స్పెషలిస్ట్ వైద్యులను సంప్రదించాలని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ సిఫార్సు చేసింది. వ్యక్తులకు ఇన్‌ఫ్లూయెంజా టీకా కార్యక్రమాన్ని విస్తరించాలని అధికారులకు వైద్యులు సూచిస్తున్నారు.

**హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా లక్షణాలు:** అధిక జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, తలనొప్పి, అలసట, శరీర నొప్పి, చలి, శ్వాస ఆడకపోవడం, తీవ్రమైన వాంతులు, డీహైడ్రేషన్, లో బ్లడ్ ప్రెషర్, బ్లూయిష్ లిప్స్, మూర్ఛ, కన్ఫ్యూజన్, ఛాతీలో నొప్పి.

# వడదెబ్బ మరియు చర్మపు చికాకులకు ఇంటి నివారణలు



వేసవి కాలం ప్రారంభం కాగానే అనేక చర్మ సమస్యలు దండెత్తుతాయి. చాలా సార్లు ఈ ఎండకాలం మనం ఇంట్లో నుండి బయటకు వెళ్ళకూడదు అనుకున్నప్పటికీ ఇంట్లో ఉండలేము. ఏదో ఒక పనికి సంబంధించి ఎండలో బయట తిరగాల్సి వస్తుంది. మీరు బయటకు వెళ్ళవలసి వస్తే, ప్రతి ఒక్కరికీ వడదెబ్బ తగిలితే, దాన్ని నుండి కోలుకోవడం కొంచెం కష్టం. త్వరగా కోలుకోలేరు. కొంత మంది ఎండల నుండి ఉపశమనం పొందడడానికి హాలీడే కోసం హాలీడే స్పాట్స్ బీచ్ లకు, చల్లని ప్రదేశాలకు వెళుతుంటారు. కానీ ప్రతి ఫలంగా వారు సన్ బర్న్ మరియు స్కిన్ టాన్ కు గురి అవుతుంటారు. వాటిలో ముఖ్యమైనది సూర్యకిరణాల వల్ల చర్మంపై చికాకు, ముఖం, చర్మం నల్లగా కమిలి ఉండటం, మరియు దద్దుర్లు ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తాయి.

సూర్యుడి నుండి వచ్చే యువి కిరణాలకు గురికావడం వల్ల మన చర్మంపై దద్దుర్లు మరియు చికాకు ఏర్పడవచ్చు. బయటికి రాగానే వేడికి శరీరం, చర్మం కాలిపోతుంది. దీన్ని నివారించడానికి, సన్ స్క్రీన్ లోషన్ ఉపయోగించకుండా బయటికి వెళ్లవద్దు. అంతే కాకుండా సన్ బర్న్ వల్ల కలిగే చర్మపు చికాకులను పోగొట్టుకోవడానికి ఎలాంటి హోం రెమెడీస్ ఉపయోగించవచ్చో

అలోవెరా జెల్ శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. తేమను అందిస్తుంది. అలాగే, కలబందలో యాంటీ-ఆక్సిడెంట్లు మరియు ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి, ఇది అద్భుతమైన సన్ స్క్రీన్‌గా మారుతుంది. వేడి వాతావరణంలో చర్మం చికాకు నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. అందుకు అలోవెర జెల్ ను ముఖం మరియు చర్మంపై పూయండి. ఇది ట్యానింగ్ తొలగిస్తుంది.

తేనె: తేనెలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి, ఇది చర్మపు చికాకును తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది సన్ బర్న్ మరియు టానింగ్ నుండి ఉపశమనం కలిగిస్తుంది. మీరు చర్మంపై తేలికపాటి చేతులతో చర్మం మొత్తాన్ని మసాజ్ చేసి, కొద్దిసేపు వదిలి, శుభ్రమైన నీటితో కడగాలి.

ఆపిల్ సైడర్ వెనిగర్ యాపిల్ సైడర్ వెనిగర్ మన చర్మం యొక్క పిహెచ్ స్థాయిని నిర్వహించగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. సన్ బర్న్ వల్ల కలిగే చర్మపు చికాకు కోసం, ప్రభావిత ప్రాంతంపై కొద్దిగా యాపిల్ సైడర్ వెనిగర్ అప్లై చేసి సున్నితంగా మసాజ్ చేయండి. ఇది చర్మపు చికాకును తగ్గిస్తుంది.

కీరదోసకాయ కీరదోసకాయలోని విటమిన్ ఇ కళ్ల కింద నల్లటి వలయాలను తొలగించడంలో సహాయపడుతుంది. ఎండాకాలంలో చర్మంపై చికాకును నివారించడానికి, కీరదోసకాయ తురుము మరియు ఆ రసాన్ని ముఖానికి పట్టించి, కాసేపు మసాజ్ చేయండి.

కోల్డ్ కంప్రెస్ కోల్డ్ కంప్రెస్ సహాయంతో, ముఖం మీద మంట, నొప్పి మరియు వాపు తొలగించవచ్చు. ఇందుకోసం ఫ్రీజర్‌లో ఉన్న ఐస్ క్యూబ్స్‌ని బయటకు తీసి గుడ్డలో చుట్టి ముఖానికి, మిగిలిన చర్మానికి అప్లై చేసి, కొద్దిసేపు గ్యాప్ తర్వాత ఈ విధానాన్ని పునరావృతం చేస్తే త్వరగా ఉపశమనం లభిస్తుంది.

వంట సోడా బేకింగ్ సోడా అన్ని రకాల జుట్టు మరియు చర్మ సమస్యలకు గొప్ప ఔషధం. వేడి వేసవిలో బేకింగ్ సోడా ఒక వరం. మనం నిత్యం తాగే నీటిలో కాస్త బేకింగ్ సోడా కలుపుకుని కాసేపు ఉంచి ఆ నీటిలో స్నానం చేస్తే వడదెబ్బ సమస్య తగ్గుముఖం పడుతుంది.

పెరుగు చర్మాన్ని మృదువుగా మరియు చల్లగా ఉంచడంలో సహాయపడుతుంది. సన్ బర్న్ వల్ల కలిగే చికాకు నుండి ఉపశమనం పొందేందుకు పెరుగు సహాయపడుతుంది. వడదెబ్బ మరియు చికాకు నుండి విముక్తి పొందడానికి ఒక చెంచా పెరుగును తీసుకొని ప్రభావిత ప్రాంతాలలో రాయండి. కాసేపు మసాజ్ చేయండి.

బొప్పాయి వడదెబ్బ వల్ల చర్మం దెబ్బతినకుండా ఉండాలంటే బొప్పాయి పండును చూర్ణం చేసి ప్రభావిత ప్రాంతంలో రాస్తే సూర్యకిరణాల వల్ల చర్మ నష్టం నయమవుతుంది. చర్మం కూడా మృదువుగా ఉంటుంది.

కొబ్బరి నూనె చర్మానికి చాలా ఉపయోగకరంగా పరిగణించబడుతుంది. ఇది లైట్ స్కిన్ టానింగ్ మీద ఉపయోగించవచ్చు. ఈ ట్యానింగ్‌తో సహజ పద్ధతిలో తొలగించవచ్చు.

# మజ్జిగతో బోలెడు ప్రయోజనాలు



వేసవి కాలం కొనసాగుతోంది. చాలా మంది ఈ సీజన్‌లో మజ్జిగను తీసుకుంటారు. అయితే మజ్జిగతే ఎన్నో లాభాలున్నాయంటున్నారు. ముఖ్యంగా ఎండాకాలంలో శరీరానికి మజ్జిగ ఎంతో అవసరం. ఇతర శీతలపానియాల కంటే ఈ పానీయం శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. వేసవిలో చల్లచల్లగా తాగితే మనకు అనేక ప్రయోజనాలున్నాయి.


వేసవిలో మజ్జిగ తాగడం వల్ల శరీరం చల్లబడుతుంది. ఎండా వేడి నుంచి ఉపశమనం కలుతుంది. ఎండకు వెళ్లి వచ్చేవారు ఇంటికి రాగానే చల్లని మజ్జిగలో నిమ్మకాయ రసం పిండుకుని తాగినట్లయితే వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. శరీరంలో ద్రవాలు సమతూకంలో ఉంటాయి.

మజ్జిగను తాగడం వల్ల శరీంలో ఉన్న చెడు కొలెస్టాల్ తగ్గుతుంది. మజ్జిగలో ఉండే బయోయాక్టివ్ సమ్మేళనాలు కొలెస్టాల్ స్థాయిలను నియంత్రిస్తాయి. అందువల్ల చెడు కొలెస్టాల్ తగ్గి మంచి కొలెస్టాల్ పెరుగుతుంది.

కాల్షియం లోపం ఉన్నవారికి మజ్జిగ ఎంతగానో ఉపయోగపడుతుంది. మజ్జిగ వల్ల శరీరానికి కాల్షియం అందుతుంది. అంతేకాదు ఎముకలు, దంతాలు దృఢంగా మారుతాయి. మజ్జిగ తాగడం వల్ల రక్త సరఫరా మెరుగు పడుతుంది. జీర్ణ సమస్యలు లాంటివి తగ్గిపోతాయి. ముఖ్యంగా గ్యాస్, అసిడిటీ సమస్య ఉన్నవారికి మజ్జిగా ఎంతో ఉపయోగపడుతుంది. జీర్ణ సమస్యలు పోతాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది.

మజ్జిగ అన్నంలో మామిడి పండ్లను కలిపి తినడం వల్ల విటమిన్-ఏ,డీ శరీరానికి పుష్కలంగా అందుతుంది. పలచని మజ్జిగలో నిమ్మరసం, ఉప్పు కలిపి పిల్లలు, పెద్దలు తాగినట్లయితే ఆరోగ్యానికి ఎంతో మంచిదంటున్నారు.

## చిట్టి గుండెను కాపాడుకోవాలంటే ఉపవాసమే గత్యంతరం



అప్పుడప్పుడు చేసే ఉపవాసంతో మన ఆరోగ్యానికి ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఈ విషయాన్నే ఆరోగ్య నిపుణులే స్వయంగా చెబుతున్నారు. ప్రస్తుత మానవ ప్రపంచంలో మనిషిని వేధిస్తున్న గుండె జబ్బులకు ఉపవాసంతో చెక్ పెట్టవచ్చంట. శరీరంలో కొవ్వు శాతం పెరగడం కారణంగానే ఇలా జరుగుతుండగా.. ఫాస్టింగ్ అనేది శరీరంలోని కొవ్వును తగ్గించడంలో సహాయపడుతూ ప్రమాదాన్ని నివారిస్తుంది. నచ్చిన సమయంలో అనుసరించే ఇలాంటి ఉపవాసం వల్ల కేవలం గుండె ఆరోగ్యమే కాకుండా ఇతర అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. సమయానికి తిన్నా, తినకపోయినా.. వ్యాయామం చేసినా, చేయకపోయినా.. ఈ రోజుల్లో గుండె జబ్బు మరణాలు పెరుగుతున్నాయి. అందుకే తీసుకునే ఆహారం మూలంగా కొలెస్ట్రాల్ పేరుకుపోయి గుండెకు ప్రమాదం చేకూరకుండా ఉండేందుకు అడపా దడపా ఉపవాసం మంచిది అంటున్నారు.

ఇంకా దీని వల్ల బాడీలోని ఇన్సులిన్ హార్మోన్‌కు మన శరీరం స్పందించే విధానం మెరుగుపడుతుంది. శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయిలను కూడా సమతుల్యం చేస్తుంది. ఇంకా కొలెస్ట్రాల్, అధిక బరువు, డయాబెటిస్ ప్రమాదాన్ని అరికడుతుంది. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ అనేది కేవలం సమయ పరిమితితో కూడిన ఆహారం. ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఆహారం తీసుకోకుండా ఉండటం ఒక పద్ధతి అయితే, ఉదయం 11 రాత్రి 8 గంటల వరకు మరో పద్ధతి. అలాగే ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల మధ్య ఒకసారి తింటూ ఉపవాసం ఉండటం కూడా చేయవచ్చు. మొత్తానికి 12 గంటల ఉపవాసమని గుర్తుంచుకోవాలి.

**ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ ప్రయోజనాలు:** గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. గుండెపోటు, స్ట్రోక్స్, లేదా కరోనరీ ఆర్టరీ వ్యాధుల ప్రభావం ఉండదు. హైబీపీ, కొలెస్ట్రాల్ సమస్యలను తగ్గించి, డయాబెటిస్ వల్ల వచ్చే ప్రమాదాలను నివారిస్తుంది. అధిక మాంసకృత్తులు, కొవ్వులు, ఫైబర్స్ వంటివి శరీరంలో సమతుల్యంగా ఉంటాయి. ఉపవాసంలో పుష్కలంగా నీరు త్రాగడం ద్వారా హైడ్రేటెడ్‌గా ఉండవచ్చు.

## ఆనంద్ మార్గ ధ్యాన సాధన శిబిరం ప్రారంభం



**అరిలోవ, (విశాఖ సమాచారమ్):** ఇందిరానగర్ లో ఉన్న ఆనంద మార్గ ఆశ్రమంలో జాతీయ సాధన శిబిరం గురువారం ఉదయం ప్రారంభమైంది. దేశంలో వివిధ ప్రాంతాల నుండి ఆనంద్ మార్ ఆచార్యులు, సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గురువారం ఉదయం సాముహిక ధ్యానం నగర సంకీర్తన కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం సామూహిక ధ్యానం, భజన కార్యక్రమాం, సహపంక్తి భోజన కార్యక్రమాలు జరిగాయి. ఈ శిబిరం ఆదివారం వరకు ఉంటుందని ఆనంద్ మార్గ విశాఖ యూనిట్ ఆచార్యులు సౌమ్యానంద అవధూత తెలిపారు. ఈ శిబిరంలో ఆనంద మార్గ సభ్యులతో పాటు ఇతరులు కూడా పాల్గొనవచ్చునని తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న వారికి ఉచితంగా వసతి, ఆహారం అందిస్తామన్నారు. ఈ శిబిరంలో యోగాసనాలు, ధ్యానం పై శిక్షణ ఇస్తామని , పాల్గొనడానికి ఆసక్తి ఉన్నవారు 9550775518 నెంబర్కు సంప్రదించాలని కోరారు.

## యువత మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని స్ఫూర్తి పొందాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా అదనపు ఎస్పీ విజయభాస్కర్, అదనపు ఎస్పీ క్రైమ్స్ పి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ విజయభాస్కర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష అసువులు బాసిన మహనీయుడు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం మహోన్నతమైనదని, యువత మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలనీ తెలిపారు.అదనపు ఎస్పీ (క్రైమ్స్) పి.సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోయారనిఅన్నారు

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు తో పాటుగా ఎస్.బి ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఇతర పోలీస్ అధికారులు, డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాయామం తోనే ఆరోగ్యం: కెల్లా సత్యనారాయణ



**అరిలోవ, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 13వ వార్డు పరిధి స్కిల్ డెవలప్మెంట్ ముడ సర్లోవ సమీపంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓపెన్ జిమ్ వద్ద పుల్లపు స్టాండ్ ను వైసిపి వార్డు అధ్యక్షులు కెల్ల సత్యనారాయణ చేతుల మీదగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మూర్తి ఈశ్వరరావు వీర్రాజు రమణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఆదిలోనే ముచ్చెమటలు పట్టించిన ఇన్వాలీడ్ పోస్టల్ బ్యాలెట్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజవకర్గ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో అభ్యర్థులను ఆదిలోనే పోస్టల్ ఇన్వాలీడ్ ఓట్లు ముచ్చెమటలు పట్టించాయి. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 228 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు చెల్లకుండా పోయాయి. ఆరుజిల్లాల్లో కలిపి 767 పోస్టల్ బ్యాలెట్లు అధికార యంత్రంగాం ఎన్నికల విధుల్లోకి పాల్గొన్నవారికి జారీచేసింది. అయితే అందులో 583 మంది మాత్రమే ఓటును వినియోగించుకోగా మళ్లీ అందులోనే 228 ఓట్లు చెల్లకుండా పోయాయి. దీనితో పోస్టల్ బ్యాలెట్ సుభ సూచికం అనుకున్న అభ్యర్థులకు గుండెల్లో రాయి పడినట్టు అయ్యింది. పోస్టల్ బ్యాలెట్ పరిస్థితే ఈ విధంగా ఉంటే చాలా చోట్ల బ్యాలెట్ లో ప్రాధాన్యత ఓట్లు సక్రమంగా వేయలేదనే ప్రచారం జరిగింది. సాధారణ బ్యాలెట్ పేపర్లు పరిశీలన తరువాత ఇంకెన్ని ఓట్లు చెల్లకుండా పోతాయోననే ఆందోళన బరిలో ఉన్న అభ్యర్థులు వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎన్నికల ఫలితాలపై హై కోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో ఒక్కో చేదువార్త అభ్యర్థులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నది.

## పొట్టి శ్రీరాములు ఆశయాలను యువతీ ముందుకు తీసుకువెళ్లాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అమరజీవి పొట్టి శ్రీరాములు 151 వ జయంతి సందర్భంగా పట్టణ మెయిన్ రోడ్ లో శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం జంక్షన్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ద వి నాగ జగదీశ్వరరావు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ 1952 సంవత్సరంలో పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు కోసం మద్రాసులో బులుసు సాంబమూర్తి గృహములో ఆమరణ నిరాహార దీక్షకి పూనుకున్నారని అతను దీక్షకు చనిపోయే వరకు ఏ తెలుగువాడు సహకరించలేదని చనిపోయిన తర్వాత ఊరేగింపులో తెలుగు విద్యార్థులు బయటకు వచ్చి ఆందోళన చేసిన తర్వాత ఒక్కసారిగా తెలుగు వారందరూ ముందుకు వచ్చారని అన్నారు. అలాగే అమరావతి రైతులు 1448 రోజులుగా చేస్తున్న దీక్షలను కూడా ఆంధ్రప్రదేశ్ పౌరులు పట్టించుకోవడంలేదని ఏనాటికైనా ప్రజల్లో చైతన్యం వచ్చి ఆందోళనకు దిగే పరిస్థితి వస్తుందని నాడు రాజాజీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పినట్టే నేడు జగన్ రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే విధంగా యువతరం పొట్టి శ్రీరాములు ఆశయాలను తీసుకొని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కంకణం కట్టాలని యువతకు నాగ జగదీష్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో సురే సతీష్ ,బోద్ధపు ప్రసాద్, గూండా సాయి,కుప్పిలి జగన్మోహన్,మల్ల గణేష్, దొడ్డి జగదీష్ ,దూలం ప్రసాదు,బుద్ధ భువనేశ్వర్,కర్రి మల్లేశ్వరరావు, సిమెంట్ రామకృష్ణ, పొలిమేర నాయుడు,బుద్ధ విశ్వనాథం, గుర్రాల వాను ,విల్లూరి సత్తిబాబు,బుద్ధ శ్రీనివాసరావు, బొడ్డెడ శ్రీనివాసరావు, పెంటకోట శివరాం.పాల్గొన్నారు.

## ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటులో ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములని ఆయన త్యాగ నిరతకి తెలుగు ప్రజలు అంతా రుణపడి ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని గురువారం ఉదయం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాకినాడ రామారావుపేట, సీబీఎం స్కూల్-ఫెలోషిప్ సెంటర్లో ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు జాయింట్ కలెక్టరు ఎస్. ఇలక్కియ, జెడ్పీ సీఈవో ఎన్.వి.వి. సత్యనారాయణ, కుడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె. రమేష్ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో గాంధీజీ అడుగు జాడల్లో పయనిస్తూ భాషాప్రయుక్త రాష్ట్రాల కింద తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు చిన్న వయసులోనే ఆమరణ దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములని అన్నారు. అంత గొప్ప మహనీయునికి ఘన నివాళులు అర్పించి స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. పొట్టి శ్రీరాములు యొక్క త్యాగనిరతిని, జీవిత చరిత్రను భావి భారత పౌరులకు తెలిపే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన తెలిపారు.

జాయింట్ కలెక్టరు ఎస్. ఇలక్కియ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, నివాళులు అర్పించడం జరిగిందన్నారు. నెల్లూరు ప్రాంతంలో జన్మించిన పొట్టి శ్రీరాములు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మా గాంధీజీతోపాటు అనేక ఉద్యమాల్లో పాల్గొనడం జరిగిందన్నారు. పొట్టి శ్రీరాములు లాంటి మరో పది మంది వ్యక్తులు ఉంటే భారతదేశానికి మరింత తొందరగా స్వతంత్రం సిద్ధించేదని గాంధీజీ పేర్కొన్నట్లు జేసీ తెలిపారు. ప్రధానంగా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. ఇలాంటి చారిత్రక ఘటనలను గుర్తు చేసుకుంటూ నేటి యువత స్ఫూర్తిని పొందటం ముఖ్యమని జేసీ ఇలక్కియ తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి సత్య రమేష్, కాకినాడ ఆర్డీవో బీవీ రమణ, ఇతర అధికారులు, ప్రజా సంఘాల నేతలు తదితరులు హాజరయ్యారు.

## శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకానికి సంబంధించి రీసర్వే పనులు వేగవంతం చేయాలి



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా చేపట్టిన జగనన్న శాశ్వత భుహక్కు భూ రక్ష పథకానికి సంబంధించి రెండో దశ రీ సర్వే పనులు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్. ఇలక్కియ అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి..రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి శుక్రవారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ.. వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష రీ సర్వే, జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణబీ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద చేపట్టిన లేఅవుట్, గృహనిర్మాణంలో పురోగతిబీ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబంధించి స్వచ్ఛ సంకల్పం, స్వామిత్వబీ స్కిల్ డెవలప్మెంట్ కు సంబంధించి యువతకు శిక్షణ కార్యక్రమాలు గ్రామ/వార్డు సచివాలయాల్లో స్పందన, గడప గడపకు మన ప్రభుత్వం అర్జీల పరిష్కారం ఇతర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై సీఎస్ జవహర్ రెడ్డి..కలెక్టర్లతో సమీక్షించారు.

వీడియో కాన్ఫరెన్స్లో డీఆర్వో కె.శ్రీధర్ రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్.వి.వి.సత్యనారాయణ, కాకినాడ కమిషనర్ కె రమేష్, సీపీవో పి.త్రినాథ్, డ్వామా పీడీ ఎం.వెంకట లక్ష్మి డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, హౌసింగ్ పీడీ బి.సుధాకర్ పట్నాయక్, డీపీవో ఆర్. విక్టర్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్లు, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ జైలులో ఉన్నవారికి హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన సదస్సు



**విజయనగరం:** జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ, విజయనగరం జిల్లా మరియు సాతి స్వచ్ఛంద సంస్థ కలసి బొబ్బిలి సబ్ జైల్ లో ఉన్న వారికి హెచ్ఐవి/ఎయిడ్స్ మరియు సుఖవ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించడమైనది. అనంతరం జైలులో ఉన్న కైదిలందరకు హెచ్.ఐ.వి పరీక్షలు నిర్వహించదము జరిగినది. ఈ కార్యక్రమములో బాగంగా పి. బాలాజీ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ హెచ్.ఐ.వి పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో కృష్ణ మూర్తి, సూపరింటెండెంట్, సబ్ జైల్, బొబ్బిలి, ఆదయ్య, కౌన్సిలర్, ఐ. సి. టి.సి, సి.హెచ్.సి, బొబ్బిలి, ఎమ్. పద్మ, ప్రెసిడెంట్, పాజిటివ్ నెట్వర్క్, ఎస్. మేనక, ప్రోగ్రామ్ కొ-ఆర్డినేటర్, సాతి, శ్రీదేవి, టి. బి సుపెరవైసర్, బొబ్బిలి పాల్గొన్నారు.

## ఆప్కోలో చేనేత వస్త్ర క్లియరెన్స్ సేల్

**విజయనగరం:** ఉగాది వేడుకను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆప్కోలో ఎంపిక చేసిన వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు క్లియరెన్స్ సేల్ ను ప్రారంభించినట్లు ఆప్కో డివిజనల్ మార్కెటింగ్ అధికారి టి. జగదీశ్వర రావు తెలిపారు. ఒకటి కొంటే మరొకటి ఉచితం (1o1 మెగా ఆఫర్), ఒకటి కొంటే రెండు ఉచితం (1o2 బంపర్ ఆఫర్) ప్రత్యేక తగ్గింపు ధరలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్లియరెన్స్ సేల్ కౌంటర్ ను పూల్ బాగ్ కాలనీలోని శివాలయం ఎదురుగా ఉన్న ఆప్కో భవన్ వద్ద ప్రారంభించినట్లు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. చేనేత కళాకారులతో మగ్గంపై తయారు చేసిన ధర్మవరం, మాధవరం, వేంకటగిరి, ఉప్పాడ, చీరాల, గద్వాల్, పట్టు.. కాటన్ చీరలు, చీరాల, బందరు, రాజమండ్రి, పాయకరావు పేట, బొబ్బిలి కాటన్ ఫాన్సీ చీరలు, మంగళగిరి, చీరాల డ్రెస్మెటీరియల్స్, రెడీ మేడ్ షర్ట్స్, టవల్స్, లుంగీలు, ధోవతులు, కాటన్ షర్టింగ్, చేతి రుమాలు తదితర చేనేత వస్త్రాలను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రకటన ద్వారా సూచించారు.

## వదిలెయ్

ఒకటికి రెండుసార్లు వివరించిన తర్వాత కూడా ఎవరికీ అర్థం కాకపోతే, అవతలి వ్యక్తికి వివరించండం వదిలెయ్

పిల్లలు ఎదిగినప్పుడు, వారు వారి స్వంత నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెడతారు, వారి వెనుకాలా పడడం వదిలెయ్

కొంతమంది వ్యక్తులతో మన ఆలోచనలు కలుస్తాయి. ఒకరిద్దరితో కనెక్ట్ కాకపోతే, అటువంటి వాళ్లను -వదిలెయ్

ఒక వయస్సు తర్వాత, ఎవరూ మిమ్మల్ని పట్టించుకోకపోతే లేదా మీ వెనుక ఎవరైనా మీ గురించి తప్పుగా మాట్లాడుతుంటే, దానిని మనసులో పెట్టుకోకుండా వదిలెయ్

మనచేతుల్లో ఏమీ లేదు, మీరు ఈ అనుభవాన్ని పొందినప్పుడు, భవిష్యత్తు గురించి ఆందోళన చెందడం వదిలెయ్

మనలోని కోరికకు, మన సామర్థ్యానికి చాలా తేడా ఉంటే, నీ గురించి నువ్వే ఎక్కువ ఆశించడం - వదిలెయ్

ప్రతి ఒక్కరి జీవితం భిన్నంగా ఉంటుంది. అంతెందుకు, ఓ మనిషి ఎత్తు, రంగు మొదలుకొని అన్నీ భిన్నంగా ఉంటాయి కాబట్టి సరిపోల్చడం వదిలెయ్

నేను మంచి స్నేహితుడిగా కనిపిస్తే సరేసరి, లేదంటే నన్ను కూడా వదిలెయ్

వృద్ధాప్యంలో జీవితాన్ని ఆస్వాదించండి, రోజువారీ పేరుకుపోయిన ఖర్చుల గురించి చింతించడం వదిలెయ్

మీకు ఈ సందేశం నచ్చితే సరి. ఒకవేళ మీకు నచ్చకపోతే, సీరియస్ గా తీసుకోకుండా వదిలెయ్...

ప్రియ మిత్రమా
వృద్ధుడు వ్యర్థుడు కాదు
ఇంటికి ఈశ్వరుడు
మూలన పడేస్తే వృద్ధుడు వ్యర్థుడు
ముంగిట్లో కూచోబెడితే ఇంటిని కాచే ఈశ్వరుడు...
బతుకుబాటలో గతుకుల్ని ముందుగా హెచ్చరించి.
కాపాడే సిద్ధుడు వృద్ధుడు... వృద్ధులు సారథులైతే యువకులు విజయులౌతారు... అనుభవాల గనులు...
ఆపాత బంగారాలు...
వదిలేస్తే వృద్ధుడు మంచానికి బద్ధుడు..
చేయూతనిస్తే ప్రతి వృద్ధుడు
ఓ బుద్ధుడు..
నిర్లక్ష్యంగా చూస్తే కేవలం మూడుకాళ్ల ముసలివాడు..
తగిన గుర్తింపునిస్తే విజయాన్నిచ్చే త్రివిక్రముడు...
ఒకనాటి బాలుడే ఈనాటి వృద్ధుడు...
తనను పట్టించుకోకున్నా,
నువ్వు పచ్చగా ఉండాలని తపించే ఉదాత్తుడు వృద్ధుడు...
పలకరిస్తే చాలు పాలకడలిలా పొంగులు వారే పసివాడు వృద్ధుడు.
వృద్ధుడంటే పైపైన చూస్తే జుట్టు తెల్లబడిన ఫలిత కేశాలవాడు... అంతర్గతంగా తలపండిన పండితుడు...
వృద్ధుడు వ్యర్థుడు కాదు... ఇంటికి ఈశ్వరుడు...
వృద్ధులకు గౌరవం ఇద్దాం
మన గౌరవం పెంచుకుందాం ౨-//-
మేము అరవై లో ఇరవై.
పచ్చగా మెరిసే పండుటాకులమే గాని
చప్పుడు చేసే ఎండుటాకులం కాదు
కలలు పండినా పండకపోయినా
మేము తలలు పండిన తిమ్మరుసులం
కొరవడింది కంటి చూపు గాని
మందగించలేదు ముందు చూపు
అలసిపోయింది దేహమే గాని
మనసుకు లేనే లేదు సందేహం
ఎగిరి అంబరాన్ని అందుకోకున్నా
ఈ భూమికి కాబోము భారం
అరవై లో ఇరవై కాకున్నా
అందని ద్రాక్ష కై అర్రులు చాచం
కుందేళ్ళమై పరుగులు తీయకున్నా
తాబేళ్లమై గెలుపు బాట చూపగలం
చెడుగుడు కూతల సత్తా లేకున్నా
చదరంగపు ఎత్తులు నేర్పగలం
సమయం ఎంతో మాకు లేకున్నా
సమయమంతా మీకు సమర్పిస్తాం
అనుకోకుంటే అధిక ప్రసంగం
అనుభవ సారం పంచుకుంటాం
వాడిపోయే పూవులమైనా
సౌరభాలు వెదజల్లుతాం
రాలిపోయే తారలమైనా
కాంతి పుంజాలు వెదజల్లుతాం.,,,

## ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణం త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా నేటి తరం యువత పనిచేయాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్ అన్నారు. విశాఖ నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం శ్రీరాములు చేసిన కృషిని వివరించారు. మద్రాస్ రాష్ట్రంలో తెలుగువారికి జరుగుతున్న అన్యాయానికి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోసం 54 రోజులు నిరాహార దీక్ష చేసి 1952 డిసెంబర్ 15 మరణించారు. ఈయన దీక్ష ఫలితంగా అక్టోబరు 1 ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. సత్యం, అహింస ఎంతటి గొప్ప లక్ష్యాన్నైనా సాధించబడతాయన్నారు. గౌరవ అతిథి వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన సేవలు మరువలేని అన్నారు. నేడు తెలుగువారిగా గుర్తింపు పొందుతున్నామంటే ఆయన చేసిన త్యాగాలే ప్రధాన కారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పొట్టి శ్రీరాములు పేరిట ప్రత్యేకంగా జిల్లాని ఏర్పాటు చేయడమే కాకుండా విశ్వవిద్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసిందని ఆయన జయంతి వర్ధంతి వేడుకలను సైతం అధికారికంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని నివాళులర్పించారు.

# జీతాల పేరుతో రూ. 5కోట్లు స్వాహా



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రక్షణరంగంలో ఉన్నతాధికారులుగా పనిచేసి రిటైర్ అయిన తరువాత హిందూస్థాన్ షిప్‌యార్డ్‌లో ఛైర్మన్ మరియు ఉన్నతస్థాయి అధికారులుగా 13 మంది బాధ్యతలు చేపట్టారు. కాగ్ తన ఆడిట్ రిపోర్టులో అధిక మొత్తంలో సుమారు 5కోట్ల రూ.లు జీత, భత్యాలు తీసుకున్నారని తప్పుపట్టింది. గవర్నమెంట్ సర్వెంట్‌లుగా పనిచేసి రిటైర్ అదే ప్రభుత్వ పరిశ్రమల్లో ఉద్యోగులుగా చేరితే వారి యొక్క జీతాభత్యాలు మినిమం స్కేల్స్‌లో నిర్ణయించాలి. కానీ షిప్‌యార్డ్‌లో జాయిన్ అయినటువంటి హేమంత్ ఖత్రీ, సందీప్ పరిజా, జి.వెంకటేశ్వర్లు, అనిల్ దంగవల్, కుంజమన్ మాథ్యూ, వై. శివరామకృష్ణన్, జె. అమరింద్ సింగ్, గిరిదీప్ సింగ్, విజయకుమార్, పిఎం.సాల్లీ, రవి ముత్తు స్వామి, మిత్ర, ఎల్.వి. శరత్ బాబు అందరు హైపే ఫిక్సేసన్ చేసుకున్నారు. ఇది చట్టవ్యతిరేకమైనది.

కార్మికులకు నీతి కబుర్లు వల్లించిన మాజీ ఛైర్మన్ శరత్ బాబు మరియు పైన పేర్కొన్న అధికారులందరూ సుమారు 5కోట్ల రూపాయలు పరిశ్రమ నుండి అదనంగా చట్టవ్యతిరేకంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ రూల్స్‌కి భిన్నంగా అధిక వేతనాలు ఫిక్స్ చేసుకొని సుమారు 5కోట్ల రూపాయలు జీతాల రూపంలో తీసుకున్నారని కాగ్ తన రిపోర్ట్ పేర్కొన్నది.

నేను చాలా నిక్కచ్చిపరుడునని గొప్పలు చెప్పుకొని ఎల్&ఎం సిరీస్ కార్మికులను ఫిక్సడ్‌టర్మ్ ఉద్యోగులుగా మార్చి వారి జీవితాలతో ఆడుకున్న శరత్ బాబు మరియు ఇతర అధికారుల నుండి అదనంగా తీసుకున్న వేతనాలను అణాపైసలతో సహా వసూలు చెయ్యాలి. షిప్‌యార్డులో అన్ని విభాగాలలోనూ ప్రధానంగా పనిచేస్తున్న ఎల్&ఎం సిరీస్ స్టాఫ్, కార్మికులను పర్మినెంట్ చెయ్యకపోగా షిప్ యార్డ్ ఆర్థికంగా బాగులేదనే సాకుతో ఎల్&ఎం సిరీస్ కి పర్మినెంట్ ఉద్యోగులకు ఇచ్చే అలవెన్సులు ఇవ్వకుండా, కార్మికులకు పెంచవలసిన మీల్స్ అలవెన్సు పెంచకుండా, కార్మికులకు ప్రమోషన్లు ఇస్తే అదనపు ఖర్చు అని నీతి వాక్యాలు వల్లించే ఛైర్మన్ ఖత్రీగారు దీనికి సమాధానం ఏమి చెపుతారు.? ఛైర్మన్ ఖత్రీ గారు కాగ్ బయట పెట్టిన రిపోర్ట్ పై మీ సమాధానం ఏమిటి? రిటైర్ అయిన ఉద్యోగులకు లీవ్ బకాయిలు అడిగితే డబ్బులు లేవు అంటారు, కార్మికుల వెల్ఫేర్ కోసం వేలల్లో అయ్యే ఖర్చుకి కూడా ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయి అంటారు. కాని మీరు, రక్షణ రంగం నుండి వచ్చిన అధికారులు మాత్రం డిపిఇ రూల్స్ ప్రకారం వేతనాలు ఫిక్స్ చేసుకోకుండా కోట్లలో అధిక జీతాలు తీసుకుంటున్నారు. ఇది నేరం కాదా?

తమ చేతిలో షిప్‌యార్డ్ పరిశ్రమ వుందని తామే ఉన్నత అధికారులమని భావించి కేంద్ర ప్రభుత్వ రూల్స్ కూడా అధిగమించి అత్యధిక జీతాలు పెంచుకొని జీతాలు తీసుకోవడం డిపిఇ రూల్స్‌కి భిన్నమైనది. కనుక కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ అధికారుల నుండి 5కోట్ల రూపాయలు రికవరీ చేయాలని తప్పుడు పనులకు పాల్పడిన వీరిపై విచారణ జరిపించి తగు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము.

ఏ విధమైన కుంటిసాకులు చెప్పకుండా షిప్‌యార్డ్ సంస్థకోసం తమ జీవితాలను ఫణంగా పెట్టి పనిచేస్తున్నటువంటి ఎల్ & ఎం సిరీస్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చెయ్యాలి. కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాము.

# సామాజిక ఆర్థిక సర్వే విడుదల చేసిన సీఎం జగన్



ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో దూసుకు పోతోంది. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో తన హవా చాటుతోంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. 2022-23కి గాను రాష్ట్ర సామాజిక ఆర్థిక సర్వేను సీఎం బుధవారం విడుదల చేశారు.

**గతేడాదితో పోలిస్తే అధిక జీఎస్‌డీపీ:** 2022-23కి ఆంధ్రప్రదేశ్ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి వృద్ధిరేటు 16.22 శాతంగా నమోదైనట్లు సామాజిక ఆర్థిక సర్వే వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే మరింత వేగంగా ఆర్థిక వ్యవస్థ పుంజుకున్నట్లు చెప్పింది. గత ఆర్థిక సంవత్సరానికి జీఎస్‌డీపి 11 లక్షల కోట్లకు పైగా అంచనా వేయగా.. ఈ ఏడాది 13 లక్షల కోట్లు లక్ష్యంగా నిర్ణయించారు. అంటే అప్పటితో పోలిస్తే దాదాపు 2 లక్షల కోట్లు అధికమన్నమాట.

ప్రధాన రంగాల్లో మంచి వృద్ధి: వ్యవసాయం, అనుబంధ రంగాల స్థూల విలువ ఆధారిత వృద్ధి రేటు 13.18 శాతంగా నమోదైంది. వ్యవసాయం, మత్స్య సంపద విభాగాలు దాదాపు 20 శాతం దగ్గర పోటీపడుతున్నాయి. ఇక పరిశ్రమల రంగం 16.36 శాతం, సేవల రంగం 18.91 శాతం చొప్పున జీవీఏ సాధించాయి. హోటళ్లు, రవాణా, రియల్ ఎస్టేట్ విభాగాలు మంచి వృద్ధిని కనబరచినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

గత ఆర్థిక సంవత్సరంలో ఇలా.. 2021-22లో దేశ వృద్ధి రేటు 7 శాతం ఉండగా.. స్థిరమైన ధరల వద్ద ఆంధ్రప్రదేశ్ రికార్డు స్థాయిలో 7.02 నమోదు చేసింది. మొత్తంగా చూస్తే వ్యవసాయం 36.19, పరిశ్రమలు 23.36, సేవల రంగం 4.45 శాతం వృద్ధి సాధించాయి. అప్పుడు దాదాపు 2 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయం 2022-23లో 2.20 లక్షల కోట్లకు పెరిగింది.


ప్రజాసంక్షేమం, ప్రభుత్వ పథకాలు: నవరత్నాలు సహా ఇతర పథకాల విషయానికొస్తే.. విద్య, ఆరోగ్యం, మహిళలు, రైతులు, సంక్షేమం మొదలైన వాటి కోసం ఇప్పటివరకు రూ.1.97 లక్షల కోట్లను ఏపీ ప్రభుత్వం వెచ్చించింది. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా ఈ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమచేసింది. రైతుల సంక్షేమం కోసం 27 వేల కోట్లు కేటాయించగా.. 52.38 లక్షల కర్షక కుటుంబాలు లబ్ధి పొందాయి.

ఈజ్ ఆఫ్ డూయింగ్ లో అగ్రస్థానం: విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023ని ఏపీ ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించింది. 6 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు రూ.13.42 లక్షల కోట్ల నిబద్ధతతో 378 అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ వరుసగా 3 సంవత్సరాలు మొదటి ర్యాంక్ ను పొందింది. తద్వారా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూర గొన్నట్లు సామాజిక ఆర్థిక సర్వే 2022-23 పేర్కొంది.

# తెలుగు ప్రజలకే గర్వకారణం పొట్టి శ్రీరాములు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలని పోరాడి తన ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని ఏయూ విద్యా విభాగాదిపతి ఆచార్య టి.షారోన్ రాజు అన్నారు. గురువారం ఏయూ విద్యా విభాగంలో పొట్టి శ్రీరాములు జయంతి ని నిర్వహించారు. విద్యార్థుల సమక్షం లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధనకోసం అమరణ నిరాహారదీక్ష సల్పిన ఆ మహనీయుడు నేటి తరానికి ఆదర్శమన్నారు. దేశం కోసం పోరాటాలు చేసిన యోధుల జీవిత చరిత్రలను యువతరం తెలుసుకుని స్ఫూర్తిని పొందాలని సూచించారు. పొట్టి శ్రీరాములు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్లిన సందర్భాలను వివరించారు. దేశమే ప్రథమం అనే నినాదంతో కుటుంబాన్ని వదిలి గాంధీజీ ఆశయాలకు ఆకర్షితులై స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న విధానాన్ని వివరించారు. పొట్టి శ్రీరాములు దేశం కోసం, తెలుగు ప్రజల కోసం జరిపిన పోరాటాలను కళ్లకు కట్టినట్టు వివరించారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.




WANTED DISTRIBUTERS
Fitearly

A food supplement powder to drink with milk to regain Energy. Purely without sugar and Very Very Tasty.
IQ Up-HG

A food supplement for school and college going GIRLS to Improve Memory power, Growth, balance Harmones and keep ENERGYTIC.
IQ Up-HB

An interesting and tasty food supplement for school and college going boys to improve concentration on study, sports, memory, IQ, fitness and keeps always ENERGYTIC.
These Three products are manufactured by shri Akella Subrahmanya Sharma, M.D., Herbindo pvt.ltd. Hyderabad.
* Marketing and Business promotion Support is offered for Distributors.
Minimum Investment :
Rs. 25,000/- Only
Atractive profits and lagre Sales assured.
Contact : 9393949345
S.V.Rao, Visakhapatnam

మెగా బ్రాహ్మణ వివాహ వేదిక
తెలుగు బ్రాహ్మణ వధూవరుల
వివాహ పరిచయ కార్యక్రమం
విశాఖ సమాచారమ్ దినపత్రిక కార్యాలయం
9-3-16, పిఠాపురం కోలనీ, (కృష్ణా కాలేజ్ జంక్షన్, మెయిన్‌రోడ్డు) విశాఖపట్నం-530003

తేది : 26-03-2023, (ఆదివారం)
సమయం : మధ్యాహ్నం గం. 2.00 ల నుండి సాయంత్రం గం. 5.00 వరకు.
శ్రీకాకుళం నుండి విజయవాడ వరకు,
హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై,
బెంగుళూరు, పూణే వంటి ప్రముఖ
నగరాలలో పనిచేస్తున్న సుమారు
500 మంది వధూవరుల వివరములతో...
రిజిస్ట్రేషన్ మరియు వివరముల కొరకు :
9393949345, 8074541283

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345,
Visakhapatnam : Cell : 9346314199, Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921,
Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389, Cheedikaada : Cell: 97686 33999, Gaajuwaaka : Cell: 70139 78488